


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 30.12.2025 | సంపుటి : 2 | సంచిక :324 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Tuesday | 30.12.2025 | volume : 2 | Issue : 324 | Pages : 8 | Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు

### తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

**క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు**

**టోకెన్లు ఉన్నవారికే దర్శన భాగ్యం**

తిరుమల, డిసెంబర్ 29 : శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు

-మిగతా 2 లో..

# కేసీఆర్ గారూ.. బాగున్నారా

### తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

**హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, విపక్షనేత కేసీఆర్**

**కేసీఆర్‌కు నమస్కరించి ఆరోగ్యంపై సిఎం వాకబు**

**కేసీఆర్‌ను కలిసి పలకరించిన మంత్రులు**

**కేసీఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు**

**అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు**



హైదరాబాద్, డిసెంబర్ 29 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ


-మిగతా 2 లో..

## కెసిఆర్ ఎందుకు వెళ్లారో.. ఆయననే అడగండి



హైదరాబాద్, డిసెంబర్ 29 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ నుంచి ఎందుకు వెళ్లిపోయారో తెలీదని.. ఈ ప్రశ్న ఆయననే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులకు సీఎం ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నుంచి


-మిగతా 2 లో..



## ఢిల్లీలో రెడ్ అలర్ట్..

విమాన సర్వీసులకు అంతరాయం

07



07

## ఆరావళి పర్వతాల కొత్త నిర్వచనంపై దుమారం

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

# బీఆర్ఎస్ హయాంలో పాలమూరుకు అన్యాయం

### పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్లక్ష్యం

**డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు**

**పైగా 90శాతం పనులు పూర్తయ్యాయనే దుష్ప్రచారం**

**సాగునీటి జలాలపై చర్చలో మండిపడ్డ మంత్రి ఉత్తమ్**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.



హైదరాబాద్,డిసెంబర్ 29 : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేతకానితనాన్ని మంత్రి ఎండగట్టారు. 2015లో ఈ ప్రాజెక్టు కోసం జీవో జారీ

-మిగతా 2 లో..



## సైబర్ మోసగాళ్ల బురిడీ

**కోటి 95 లక్షల 75 వేల లూటీ**

**మహిళ ఫిర్యాదుతో ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్**

**అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక**

హైదరాబాద్, డిసెంబర్ 29 : సైబర్ మోసాలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా, తరచూ

-మిగతా 2 లో..

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ



**ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్**

**అందుకు ఎంపిటిసి, జడ్పిటిసిలపై వెనకడుగు**

**తెలంగాణ తెచ్చిన నేతగా కెసిఆర్‌ను గౌరవించాలి**

**మీడియా చిట్‌చాట్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్**

అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు.

హైదరాబాద్, డిసెంబర్ 29 : ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 40 శాతం

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 169 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 245 (కిలో) |
| స్కిన్ లెస్ | 279 (కిలో) |


12 గుడ్ల రిటైల్ ధర ₹92

# కొండగట్టుకు పవన్ కళ్యాణ్

### 3న డిప్యూటి సిఎం షెడ్యూల్ ఖరారు

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం**

జగిత్యాల, డిసెంబర్ 29 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక



# రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఏవీ?

### ఉద్యోగుల పిఆర్సి ఏమయ్యింది

**హరీష్ రావు విమర్శలు**



హైదరాబాద్,డిసెంబర్ 29 : బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇయ్యాల్సిన పీఆర్సీ గానీ, డీలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టలేదని హరీష్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామిని కూడా నెరవేర్చలేదని హరీష్ అన్నారు. పదవీ విరమణ పొందిన

-మిగతా 2 లో..

## దారితప్పిన వాళ్లకు అఖండ-2 కనువిప్ప

### సనాతన హిందూ ధర్మపరిరక్షణ



**బోయపాటితో కలసి మూవీని వీక్షించిన బండి సంజయ్**

హైదరాబాద్, డిసెంబర్ 29 : ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా నందమూరి బాలకృష్ణ నటిం చిన అఖండ -2

-మిగతా 2 లో..

# పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

చేసినప్పటికీ, కేంద్ర జల సంఘానికి డీపీఆర్ సమర్పించడానికి నాటి ప్రభుత్వానికి ఏడేళ్ల మూడు నెలల సమయం పట్టిందని ఎద్దేవా చేశారు. ఆశ్చర్యకరంగా, డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు చేశారని, ఇది వారి పాలనలోని అస్తవ్యస్త విధానాలకు నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టి, దాని సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపారని ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా, ప్రాజెక్టు పనులను ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా చేయాలని నాటి రాజకీయ పెద్దలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. అసలు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 70,000 కోట్లకు పైగా ఉంటే, బీఆర్ఎస్ హయాంలో జరిగింది కేవలం రూ. 27,000 కోట్ల పనులు మాత్రమే. ఇది 90 శాతం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి వాటిని కూడా తొమ్మిదిన్నరేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తమ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతోనే పూర్తి చేసి తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తాము అధికారంలోకి వచ్చాక 11 పంపుల ఇన్‌స్టలేషన్ పూర్తి చేశామని, ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా బయటపెడతామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో తాము 90టీఎంసీలు డిమాండ్ చేశామని చెప్పుకొచ్చారు. తాము 45 టీఎంసీలు మాత్రమే అడిగామని హరీశ్‌రావు దుష్ప్రచారం చేశారన్ని ఫైర్ అయ్యారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిపడ్డారు. సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్‌ను అవుటాఫ్ కాంటెక్స్ట్ తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తానని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీ రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారు.. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్‌లైన్ పెట్టామని పేర్కొన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ నేతల చేతకాని తనాన్ని తమపై రుద్దవద్దని హితవు పలికారు. సాగునీటి జలాలపై డీపీఆర్ కేంద్రానికి పంపడానికి ఏడేళ్ల సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. డీపీఆర్ పంపే సమయానికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశారని చెప్పుకొచ్చారు. ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు..అన్యాయం చేస్తున్నామంటూ బీఆర్ఎస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

# ఉద్యోగుల పిఆర్సీ ఏమయ్యింది

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య బాగాలేక ఎంతో మంది చనిపోయారని మాజీ మంత్రి గుర్తు చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పించమని కోర్టుకు వెళ్లినా ఈ సర్కారు వారిపట్ల కనికరం చూపించలేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రథ చక్రాల్లాంటివారు, వారు సంతోషంగా ఉంటేనే ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగే అవకాశముంటుందని హరీష్ అన్నారు. కానీ.. ఇవాళ ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లకు రావలిసిన బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగుకలకు పీఆర్సీ ఇవ్వలేదు. గతంలో కేసీఆర్ హయాంలో ఒకసారి 39, మరోసారి 43 శాతం పీఆర్సీ ఇచ్చిన విషయాన్ని హరీష్‌రావు అసెంబ్లీ వేదికగా గుర్తుచేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)ను కూడా అమలు చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ తదితర బకాయిలన్నీ కూడా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన అన్నారు. అంతేకాక, ఇవాళ రిటైరయిన ఉద్యోగులు తమకు రావలిసిన బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, డబ్బులు లేక సరైన వైద్యం అందక దాదాపు 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సుమారు 15వేల మంది ఉద్యోగులు రిటైరైతే వారందరికీ అందాల్సిన బెనిఫిట్స్ ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టకుండా ఇచ్చామని హరీష్ తెలిపారు. అదేవిధంగా సీపీఎస్ పెన్షన్ స్కీమ్‌ను ఓపీఎస్‌గా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామి ఇచ్చిందని, అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, ఎప్పటిలోగా ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలు చేస్తారో చెప్పాలని హరీష్ అడిగారు. గత రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్రప్రభుత్వం కట్టాల్సిన కాంట్రీబ్యూషన్ డబ్బులు కూడా కట్టకుండా వాటిని దారి మళ్లిస్తున్నారని, సీపీఎస్ కట్టకుండా, ఓపీఎస్ అమలు చేయకపోవడంతో రెండు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దయచేసి సీపీఎస్ కాంట్రిబ్యూషన్ కట్టమని, ఓపీఎస్‌ను త్వరగా అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీష్ అన్నారు.

# సనాతన హిందూ ధర్మపరిరక్షణ

(మొదటిపేజీ తరువాయి)

అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి 'అఖండ 2 –తాండవం' సినిమాను బండి సంజయ్ సోమవారం వీక్షించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాశ్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్‌తో సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్‌తో కలిసి ఈ సినిమాను చూశారు. అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు. 'అఖండ– 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లు ఉన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా చూపించిన సినిమా అఖండ– 2. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే... ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవారే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ –2 తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడుపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలని అఖండ–2 చెబుతోంది' అని బండి సంజయ్ ప్రశంసించారు. 'భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం. కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే.... సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే.. ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన దృశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్‌ను పరిపాలిస్తున్నారు కాబట్టే వ్యాక్సిన్‌ను అందించగలిగాం. సైంటిస్టులను ప్రోత్సహించాం. కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్‌లో ఉంది. ప్రధాని మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్‌ను పరీక్షించారు' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.





# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు. తొలిరోజు సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. శాసనసభ, మండలి ఎన్నిరోజులపాటు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనం అయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. కేసీఆర్ సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నంది నగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివ రావు కలిసి కరచాలనం చేశారు. దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి ఆర్ తిరుపతి అసెంబ్లీ కార్యదర్శి హోదాలో శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

స్వామివారి దర్శనాన్ని దివ్య అనుభూతిగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు. ఈసారి వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్ల కేటాయింపులో విధానాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. వైకుంఠ ద్వార దర్శన విధులకు వచ్చిన సిబ్బంది వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకుని సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులతో అన్నారు. భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతికత ద్వార భక్తులు, వాహనాల రద్దీపై ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. టీటీడీ, పోలీస్, విజిలెన్స్ విభాగాల నుండి ఐటీ నిపుణులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు భక్తుల సమాచారాన్ని అప్డేట్ చేస్తూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల సెంటర్ లో ప్రదర్శించాలని చెప్పారు. భవిష్యత్తులో తిరుమలకు వచ్చే భక్తుల కోసం సమస్య రహిత వ్యవస్థను నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునేవిధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చలికాలం కావడంతో క్యూలైన్లలోని అన్న ప్రసాదాల పంపిణీ కేంద్రాల్లో అన్న ప్రసాదాలు చల్లబడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులకు తాగునీరు అందించేందుకు అదనంగా మొబైల్ వాటర్ డ్రమ్స్, మూడు మొబైల్ ఫుడ్ వ్యాన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తుల కోసం టీటీడీ అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించు కునేందుకు వివిధ భాషల్లో సూచిక బోర్డులను కూడా క్యూలైన్లలో మరియు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టీటీడీ క్యూలైన్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామి వారిని దర్శించుకోవాలని తెలియజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలను పురస్కరించుకుని విచ్చేసే భక్తుల రద్దీ దృష్ట్యా డిసెంబర్ 28 నుండి జనవరి 7వ తేది వరకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ లో భక్తులకు ఇచ్చే ÷ూఆ టోకెన్ల జారీని రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించవలసిందిగా



భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేయడమైనది. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు. తొలి మూడు రోజులు అనగా, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 01వ తేదీల్లో ఈ–డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం. టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీలలో నిర్దేశిరచిన సమయానికి మాత్రమే తిరుమలలోని దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు తిరుమలలో భక్తులకు ఏ ఇబ్బందులూ రాకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి వెల్లడించారు. తొలిరోజు ప్రొటోకాల్ దర్శనాలు ముగిసిన వెంటనే స్లాటెడ్ సర్వదర్శనం మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత 1:30 నుంచి మంగళవారం రాత్రి 11:45 గంటల మధ్య.. 20 గంటల పాటు సామాన్యులకే అవకాశం కల్పిస్తాం. సుమారు 70వేల మందికి దర్శనం చేయించాలన్నది లక్ష్యం. ఏ రోజు టోకెన్ పొందితే, అదేరోజు దర్శనం చేయించేలా గంటలవారీగా లెక్కలు కట్టి అమలుచేస్తాం. ఇందుకోసం ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగించనున్నాం. భక్తులు టోకెన్‌పై నిర్దేశిరచిన సమయానికి, సూచించిన ప్రదేశానికి రావాలి. వేచి ఉండే భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, దద్ధోజనం తదితర 16 రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. మొదటి మూడు రోజులు 24 గంటలూ అన్నప్రసాదాలు, వేడి పానీయాలు కాఫీ, టీ, బాదం పాలు, చిన్నపిల్లలకు పాలు సిద్ధంగా ఉంటాయి. నిత్యం 4.30 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నాం. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్కులు ఏర్పాటుచేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఏసీ –5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచిచూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిదని సూచించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్

(మొదటిపేజీ తరువాయి)

ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు. పాలమూరు–రంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే దూషిస్తున్నారు. ఆయన తిట్లు నాకు దీవెనలు. నన్ను తిడితే పడతాను కానీ.. కేసీఆర్‌ను అంటే ఊరుకునేది లేదు. ఆయనకు మంచి పేరు వస్తుందనే పాలమూరు–రంగారెడ్డి పనులు చేయట్లేదు. కాల్వల కోసం పిలిచిన టెండర్లను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారని కేటీఆర్ అన్నారు. పార్టీని వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదన్నది తన అభిప్రాయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అర్ఎస్‌ను కాదని భాజపాలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారు. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం?వారి విషయంలో సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయి. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదు. కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉంది. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకుల వాతావరణం ఉంటే మంచిదేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ ఎందుకు వెళ్లారో.. ఆయననే అడగండి

కేసీఆర్ వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రిని జర్నలిస్టులు ప్రశ్నించారు. అలాగే ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో ఏం మాట్లాడారని వారు అడిగారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్, తాను మాట్లాడుకున్నది మీకెందుకు చెబుతామని చమత్కరిస్తూ సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా అసెంబ్లీకి వచ్చిన వెంటనే కేవలం 5 నిమిషాల్లోనే కేసీఆర్ ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇక.. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, ప్రభుత్వ విప్‌లతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అసెంబ్లీలో తమ స్టాట్రజీపై నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేయనున్నారు. మరికాసేపట్లో బీఏసీ సమావేశం జరుగనుంది. అసెంబ్లీ పనిదినాలను బీఏసీ ఖరారు చేయనుంది.

## సైబర్ మోసగాళ్ల బురిడీ

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరికలు చేస్తున్నా... ఎక్కడో ఒక చోట అమాయకులు సైబర్ కేటుగాళ్ల బారిన పడుతునే ఉన్నారు. తాజాగా ఓ బాధితురాలకి సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించి భారీగా నగదు దోచుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఓ బాధితురాలని డిజిటల్ అరెస్ట్ పేరుతో కోటి 95 లక్షల 75 వేల రూపాయల మోసం చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆమె ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి కేటుగాళ్ల ఆట కట్టించారు. ఈ కేసులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. డిసెంబర్ 13వ తేదీన డిజిటల్ అరెస్టుకు గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేటుగాళ్ల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ క్రమంలోనే నిందితులు భావ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సోయ–ుబ్, బెలీం అనాస్‌లను అరెస్ట్ చేశారు. ప్రభుత్వ అధికారులుగా నటించి మహిళను భయపెట్టారు మోసగాళ్లు. భర్తపై కేసు ఉందని అంటూ బెదిరింపులు, నకిలీ కాల్స్ చేశారు నేరస్తులు. కరెన్సీ వెరిఫికేషన్ పేరుతో డబ్బు బదిలీలు చేశారు. మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత దుబాయ్‌కు హవాలా మార్గంలో నగదు బదిలీ చేశారు. మొత్తం 22 సైబర్ కేసుల్లో నిందితులు ఇద్దరు బ్యాంక్ ఖాతాలు వాడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు సుమారుగా రూ.3.5 కోట్ల లావాదేవీలు చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నిందితుల దగ్గరి నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపించే మెయిల్స్‌ను క్లిక్ చేయొద్దని కోరారు. అమాయకులను మోసగించే సైబర్ క్రిమినల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రిమినల్స్ అధునాతన సాంకేతికతను ఉపయోగించి అమాయకులను మోసం చేస్తున్నారని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

## కొండగట్టుకు పవన్ కళ్యాణ్

(మొదటిపేజీ తరువాయి)

పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది.

# యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

- ప్రతి గడపకు చేరేలా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్'
- అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 29 :** ఇవాళ తెలంగాణ గర్వించదగ్గ రోజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టాం అన్నారు.తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదు.. ఇది మన యువత మేధస్సుకు, సృజనాత్మకతకు ఒక గొప్ప వేదికన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి, ముఖ్యంగా మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఎంట్రీలను చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రవీంద్ర భారతిలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి... రాష్ట్ర టూరిజం, కల్చరర్,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను ప్రకటించి,అవార్డులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి 3లక్షలు,రెండో బహుమతి 2లక్షలు,మూడో బహుమతి 1లక్ష.. షార్ట్ ఫిల్మ్,బతుకమ్మ వీడియో విభాగాలకు వేరు వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచారు. పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం సినిమాటోగ్రఫీ మంత్రిగా నాకు ఎంతో గర్వకారణం. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క యంగ్ ఫిల్మ్ మేకర్ కు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. గెలుపొందిన విజేతలకు నా ప్రత్యేక శుభాకాంక్షలు. మీ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు.. తెలంగాణ భవిష్యత్తును మీ కళాత్మక దృష్టితో మరింత గొప్పగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను గతంలో దిల్ రాజు నిర్మించిన బలగం సినిమా చూసాను.. ఇటీవల వచ్చిన 'దండోరా' సినిమా చూసాను..సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చేలా,హృదయానికి దగ్గరయ్యే విధంగా ఉన్నాయి అని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో సినిమాలు తీసుకోవడానికి లోకేషన్స్ పరంగా కూడా టూరిజం డెవలప్మెంట్ చేస్తున్నామని, దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఘాట్ రోడ్డు,అటవీ మార్గాన వెళ్లే బాధలు తప్పించేందుకు 8వేల కోట్లతో మన్ననూర్ – శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నాం. ఇది సినిమా, షార్ట్ ఫిలిమ్స్ కు మంచి లొకేషన్ అవుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, :ఎఫ్డిసి ఛైర్మన్ సీహెచ్.ప్రియాంక,దర్శకులు హరీష్ శంకర్,తనికెళ్ళ భరణి,దశరథ్,రాహుల్ సిప్లిగంజ్,అశోక్ కుమార్,శ్రీలక్ష్మి,పీ.జీ. విందా,మంగ్లీ,సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తోపాటు పెద్ద సంఖ్యలో యువ దర్శకులు, కళాకారులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

# డబ్బుల కోసమే జీహెచ్ఎంసీ డీలిమిటేషన్

- అడ్డగోలుగా విభజించి పడేశారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ



**హైదరాబాద్, డిసెంబర్ 29 :** జీహెచ్ ఎంసీని అడ్డగోలుగా విభజించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జీహెచ్ఎంసీ డీలిమి టేషన్ కేవలం డబ్బుల కోసం చేస్తు న్నదనే అని అన్నారు. మర్చంట్ బ్యాంకర్ బ్రోకర్ చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. జీహెచ్ ఎంసీని మూడు ముక్కలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ అని పెట్టాడని.. దాన్ని కూడా తొందరలో ఏదో కార్పొరేషన్ చేస్తాడు కావచ్చని ఎద్దేవా చేశారు. ఏం చేసినా శాస్త్రీయంగా ఉండాలని.. కానీ ఇష్టమొచ్చినట్లు చేస్తే ఊరుకోరని తెలిపారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల విభజనపై సభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. చర్చలో అన్ని విషయాలపైనా తాము మాట్లాడతామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం ఏం చే?కుంటారో.. ఎవరికి లాభం చేకూర్చేలా చేసుకుంటారో వాళ్లిష్టమని అన్నారు. కానీ తమకు మాత్రం 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నిక చారిత్రాత్మక ఎన్నిక అని తెలిపారు. అలాంటి ఎన్నికలు ఇప్పటివరకు చూడలేదని.. మళ్లీ చూడబోమని చెప్పారు. గతంలో ఓల్డ్ సిటీలో కూడా బీఆర్ఎస్ రెండు సీట్లు గెలిచామని గుర్తుచేశారు. గతంలో మేం గెలిచిన సీట్లు ఇంకా ఎవరు గెలవలేరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి షేక్‌హ్యాండ్ ఇవ్వడంపైనా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలని అన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ప్రతి ఒక్కరికీ గౌరవం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రికి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని.. ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదేనని అన్నారు.

# తనుగుల చెక్ డ్యామ్ పేల్చేశారు

### అసెంబ్లీలో కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై దుమారం



**హైదరాబాద్, డిసెంబర్ 29 :** హుజూరాబాద్‌లో పెద్ద ఆయకట్టు కొట్టుకుపోయిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. రిపేర్ చేస్తే దాదాపు ఏడు వేల ఎకరాలకు నీళ్లు అందుతాయని పేర్కొన్నారు. వెంటనే ఆ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ప్రశ్నోత్తరాల సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చివేశారని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే చెక్‌డ్యామ్‌ను బాంబు పెట్టి పేల్చేశారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతుంటే ఆయన ప్రసంగానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం కల్పించారు. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. మేడిగడ్డ ప్రాజెక్ట్ మాదిరిగానే తనుగుల చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శతో అసెంబ్లీలో అలజడి రేగింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బాంబులు పెట్టి పేల్చారని ఆరోపణలు చేయడం ఏమిటంటూ కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. రికార్డుల నుంచి ఆ పదాలు తొలగించాలంటూ స్పీకర్‌ను కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు కోరారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2023 ఏడాది చివర్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. దీనికి కొన్ని నెలల ముందు లక్షల కోట్ల రూపాయిలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లోని పలు పిల్లర్లు కుంగాయి. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రూ.లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపానికి కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పిం చింది. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే.. దీనిపై న్యాయ విచారణ చేపడతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓటరు పట్టం కట్టాడు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు రెండేళ్ల పాటు విచారించిన ఈ కమిషన్.. తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అయితే మేడిగడ్డ పిల్లర్లు కృంగడానికి బాంబుతో పేల్చడమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది.

## బోగస్ ఏజెంట్ల మోసంలో పడవద్దు

### అసెంబ్లీలో మంత్రి పొన్నం సూచన



**హైదరాబాద్, డిసెంబర్ 29 :** బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసుల సమస్యలు వినేందుకు ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్ వెళ్లే కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ ప్రజల ఇబ్బందులను పలువురు సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా.. మంత్రి పొన్నం స్పందించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నైపుణ్యాలను బట్టి ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. టామ్ కామ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచించిన ఆయన.. ఇందులో శిక్షణ తీసుకొని ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు. నైపుణ్యం కలిగిన యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరు–మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

## మహిళ హత్య కేసులో 14 ఏళ్ల తరవాత తీర్పు

### హంతకుడికి మరణశిక్ష విధించిన కోర్టు

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్ నగర్‌లో 2011లో చోటుచేసుకున్న దారుణ హత్యకేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఈ కేసులో నిందితుడు కరణ్ సింగ్ అలియాస్ కమ్మ సింగ్‌కి కోర్టు మరణశిక్ష విధించింది. మూడో అదనపు డిస్టిక్ట్ జడ్జ్ మండా వెంకటేశ్వరరావు ఈ కేసులో తుది తీర్పు ఇచ్చారు. మహిళను కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అక్రమ సంబంధం కారణంగా హత్య జరిగినట్లు విచారణలో తేలింది. అప్పటి సనత్‌నగర్ పోలీస్ కానిస్టేబుల్ కప్పరి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తు సమయంలో పటిష్టమైన ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలైంది. నిందితుడికి మరణ శిక్ష విధించడంతో 14 ఏళ్ల తర్వాత బాధితురాలికి న్యాయం జరిగిందని పోలీసులు తెలిపారు. సీపీ అవినాశ్ మొహంతి ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ తీర్పుతో మహిళలపై జరిగే హింస ఘటనలపై చట్టపరమైన దృఢమైన సందేశమని పోలీసులు వ్యాఖ్యానించారు.

## సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

- సినీనటి మాధవీలతకు బిగ్ షాక్
- సరూర్‌నగర్ పోలీసుల కేసు నమోదు



**హైదరాబాద్, డిసెంబర్ 29 :** ప్రముఖ సినీనటి మాధవీల తకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పో లీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయి బాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూ యెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారు పెట్టిన పోస్టు వల్ల ప్రజల భావోద్వేగా లకు నష్టం జరిగిందని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాధవీలతతో పాటు మిగతా యూట్యూ బర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులోని ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో వారి సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ప్రేమ విఫలం కావడంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**అనకాపల్లి, డిసెంబర్ 29 :** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. తాను ఓ యువకుడిని ప్రేమిస్తున్నానని, అతను లేకుండా జీవించలేనని సూసైడ్ నోట్ రాసి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాను మరో యువకుడిని ప్రేమిస్తున్నానని అనుకొని మొదట ప్రేమించిన వ్యక్తి మాట్లాడటం లేదని, తన తల్లిదండ్రులకు చెడ్డ పేరు రాకూడదనే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో ఆమె పేర్కొంది. ఇదిలా ఉంటే పుస్తకాలు కొనుక్కోవడానికి వెళ్లిన తన కుమార్తె ఓ యువకుడితో గొడవ పడటం గమనించామని, ఈ కారణంతోనే ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పంచనామా చేసి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

## ఉద్యోగుల గురించి మొసలి కన్నీరు

### హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ శ్రీధర్ బాబు



**హైదరాబాద్, డిసెంబర్ 29 :** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలపై మాజీ మంత్రి హరీశ్‌రావు శాసనసభలో చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీధర్ బాబు తిప్పికొట్టారు. ఉద్యోగుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంద న్నారు. మొత్తం ఆరు డీఏలు పెం డింగ్‌లో ఉన్నట్లు హరీష్ పేర్కొన్నా రు. ఉద్యోగులకు బకాయిలు చెల్లిం చాలని కోరారు. పింఛన్ బకాయి లు రావట్లేదని 39 మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారని హరీశ్ రావు అన్నారు. దీనిపై మంత్రి శ్రీధ ర్ బాబు స్పందించారు. ఉద్యోగుల గురించి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూ రంగా ఉందన్నారు. ఆయన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సభ్యుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

## బంగ్లా అల్లర్లపై అసద్ ఆందోళన

### మైనార్టీ హిందువుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీల రక్షణతో పాటు ప్రాంతీయ స్థిరత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇక, బంగ్లాదేశ్‌లో దీపు చంద్ర దాస్, అమృత్ మండల్ హత్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. ఈ విషయంలో భారత్–బంగ్లాదేశ్ అర్థవంతమైన చర్చలు కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఎంఐఎం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. అలాగే, బంగ్లాదేశ్ సెక్యులర్, బంగ్లా జాతీయవాద పునాదులపై ఏర్పడిన దేశం, అక్కడ సుమారు 2 కోట్ల మంది ముస్లిమేతర మైనారిటీలు నివసిస్తున్నారని అసదుద్దీన్ ఒవైసీ గుర్తు చేశారు. , భారత్–బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలు పెరగకూడదని ఆకాంక్షిస్తున్నాను.. అక్కడి ప్రభుత్వం మైనారిటీల రక్షణకు కట్టుబడి ఉండాలని ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ మైనారిటీల భద్రతకు కట్టుబడి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో శాంతి అత్యంత అవసరం, ముఖ్యంగా భారత్ లోని ఈశాన్య రాష్ట్రల భద్రతకు అది కీలకం అన్నారు. అయితే, ఐఎస్ఐ, చైనా వంటి దేశాలు భారత్‌కు శత్రుత్వం ఉండటం ఆందోళన కలిగిస్తోందని హెచ్చరించారు. అదే సమయంలో భారత్‌లో కూడా జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఓవైసీ తీవ్రంగా మండిపడ్డారు.

## ప్రాణాంతకంగా చైనా మాంజా

### చైనా మాంజా తగిలి యువకుడి గొంతుకు గాయం

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** హైదరాబాద్ నగరంలో చైనా మాంజా ఆందోళన కలిగిస్తోంది. చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు. అయితే ఇది చాలా మంది ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక వ్యక్తి చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు . తాజాగా మరో వ్యక్తి చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన జమీల్ అనే యువకుడు చార్మినార్ వైపు బైక్ వెళుతున్నాడు. శంషీర్ గంజ్ ప్రాంతంలో చైనా మాంజా అతడి గొంతుకు తగిలి కోసుకు పోయింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

## అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌ల యత్నం

### అడ్డుకుని తరలించిన పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకున్నారు. అయితే, తమ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో అసెంబ్లీ వైపు కదులుతున్న వారిని గన్‌పార్క్ దగ్గర పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి రెండేళ్లు అవుతోంది.. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు ఇప్పటి వరకు రాలేదని వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. మా పెండింగ్ బిల్లులు చెల్లించి మా ప్రాణాలు కాపాడాలని ముఖ్యమంత్రికి వేడుకుంటు న్నారు. బిల్లులు చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించ డం అన్యాయం.. గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులకు డబ్బులు ఇవ్వకపోవడం వల్ల సర్పంచ్‌లుగా ఆర్థికంగా కుంగిపోయామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని.. అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్న మమ్మల్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.

## కనీసం 15రోజులు అసెంబ్లీ సమావేశాలు

### బిఎసి సమావేశంలో హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల నిర్వహణపై స్పష్టతనిచ్చేందుకు నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని, సభ నిర్వహణ తీరుపై పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను ఎక్కువ రోజులు నిర్వహించాలని ఆయన గట్టిగా పట్టుబట్టారు.బీఏసీ సమావేశం అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని, అందుకే అసెంబ్లీని కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. కేవలం వారం రోజుల్లో ప్రజా సమస్యలన్నింటిపై చర్చించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేవలం మూడు లేదా నాలుగు రోజులతో సభను ముగించే ప్రయత్నం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాల డిమాండ్లపై ప్రభుత్వం స్పందిస్తూ.. ప్రస్తుతం ఒక వారం పాటు సమావేశాలను నిర్వహించేందుకు అంగీకరించింది. అయితే, ఆ తర్వాత పరిస్థితులను బట్టి సమావేశాలను మరిన్ని రోజులు పొడిగించే అంశంపై మరోసారి బీఏసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు హరీష్ రావు వెల్లడించారు. దీనివల్ల సభ ఎన్ని రోజులు జరుగుతుందనే దానిపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది. నదీ జలాల అంశంపై సభలో ఇప్పటికే రాజకీయం వేడెక్కింది. ప్రభుత్వం ఈ అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా తాము కూడా పీపీటీ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని బీఏసీ సమావేశంలో కోరింది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రాజెక్టుల వివరాలను ప్రజలకు వివరించేందుకు తమకు కూడా సమాన అవకాశం ఇవ్వాలని హరీష్ రావు కోరారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే బీఏసీలో జరిగిన ఈ చర్చలు చూస్తుంటే, రాబోయే రోజుల్లో సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరేలా కనిపిస్తోంది.

# కేసీఆర్ మాటలకు చింతకాయలు రాలేనా?



**మాటలకు చింతకాయలు రాలుతాయా అంటే..రాలుతయానే అంటారు మాజీ సిఎం కేసీఆర్. ఎందుకంటే ఆయన మాటలతోనే పదేళ్లపాటు ఓట్లు రాల్చుకున్నారు. ఇప్పడు మళ్లీ అదే ప్రయోగానికి సిద్దం అవుతు న్నారు. రెండేళ్లుగా ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగం లోకి దిగబోతున్నట్టు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇంతకాలం విపక్షనేతగా ఆయన విఫలం అయ్యారు. తోలు తీయడానికి ముందు గత 9 ఏళ్ల పాపాల గురించి ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేది. ధరణి,ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు, ఇ- కార్ రేసింగ్ తదిరఅ వినతి కేసులు చాలానే ఉన్నాయి. వీటికి సమాధానం చెప్పడం లేదు. పైగా కెసిఆర్ కొడుకు లొట్టపీసు కేసులని బెదిరింపులకు దిగారు. ఏతావాతా రాజకీయ నేతల భాష జుగప్సాకరంగా మారింది. ఉన్నట్టుండి తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కేవలం రాజకీయంగా మళ్లీ పట్టు సాధించేందుకే తప్ప మరోటి కాదు. మళ్లీ నీళ్లు,నిధులు, నియామకాలు అంటూ నినదిస్తానని ప్రకటించినట్లు సమాచారం.**

తెలంగాణ ఏర్పడి పన్నెండేళ్ల తరవాత ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకునే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలి. తెలంగాణపై బీఆర్ఎస్‌కు మాత్రమే పెటెంట్ ఉన్నట్లుగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. తమ హయాంలో పదేళ్ల మోసాలపై మాత్రం మాట్లాడడం లేదు. ఇదంతా కేవలం రాజకీయ డ్రామా అని మాత్రం ప్రజలకు కూడా తెలుసు. వరుస ఓటములతో బిఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు, పంచాయితీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. దీంతో ఇక కెటిఆర్‌తో లాభం లేదనుకున్నాడేమో ..కెసిఆర్ స్వయంగా రంగంలోకి దిగుతానని ప్రకటించారు. గతకొంతకాలంగా బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు ఇదే ప్రకటిస్తూ వస్తున్నారు. మరోవైపు కూతురు కవిత జనంజాగృతి బాటతో బిఆర్ఎస్ నాటి పాలనా వైఫల్యాలను తూర్పారాబడుతున్నారు. ఆనాడు జరిగిన తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. అభివృద్ధి, బంగారు తెలంగాణ పేరుతో జరిగిన ప్రచారమంతా డొల్ల అని ఆమె కళ్లముందే కనిపిస్తుంటే.. వలపోస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుకంటూ వచ్చారు. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికార కోల్పోయాక జరిగిన తర్వాత వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో సిఎం రేవంత్ రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో కెసిఆర్‌పై విరుచుకు పడుతున్నారు. అసెంబ్లీకి రా తేల్చుకుందామని, చర్చిద్దామని సవాళ్లు విసరుతున్నారు.

ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే బాగండ దనో ఏమో కెసిఆర్ ..సై అంటూ సవాళ్లు విసిరారు. అందుకే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కయి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కెసిఆర్‌కు అలవాటుగా మారింది. 2018లో చంద్రబాబును బూచిగా చూపించి బొడ్లో కత్తిపెటుటుకుని తిరుగుతున్నాడని ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రచారం ఫలించి రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో అది పనిచేయలేదు. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పల్లవితో సభలు పెట్టేందుకు సిద్దం అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి అయినందున ఆయన తన సొంత జిల్లాకు అన్యాయం చేసుకుంటారని ఎవ్వరు కూడా అనుకోరు. చంద్రబాబుతో కుమ్మక్కు అవుతారనడానికి ఆధారాలు లేవు. ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేస్తారని అనుకోవడానికి లేదు. అందులోనూ కెసిఆర్‌ను ఇక అధికారంలోకి రానివ్వనని శపథం కూడా చేశారు. పాలమూరు రంగారెడ్డిపై చర్చకు సిద్దమని సవాల్ విసిరారు. అందుకేనేమో కెసిఆర్ కూడా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. నీటి అంశాలపై ప్రజలు వెంటన స్పందిస్తారి అనుకుని ఉంటారు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది. ఉంది.

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేసారు. నిజానికి తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకనే రెండేళ్లుగా ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. అసెంబ్లీకి కూడా రాకుండా పోయారు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కెసిఆర్ సహా బిఆర్ఎస్ శ్రేణులకు ఇప్పటికీ మింగుడు పడడం లేదు. దీనికితోడు సొంతంగా వ్యూహాలతో కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తున్నారు. రాజకీయంగా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి కెసిఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు.పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారని అనుకుంటే అలా జరగడం లేదు. అందుకే ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారం లోకి వచ్చారని ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉంటాయని ఇంకా కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే కృష్ణాజలాల పేరుతో రాజకీయానికి పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో అతిశయంతో పనిచేస్తే ఓటమి తప్పదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులగా విస్మరించారు. ఇప్పుడు ప్రజలకోసం అని బయలుదేరితే ప్రజలు నమ్ముతారని అనుకోవడం కెసిఆర్ మూర్ఖత్వమే అవుతుంది.

# హెచ్-1బీ వీసాలపై కక్ష సాధింపు ధోరణి

- అధికారంలోకి వచ్చిన ఏడాదిగా బెదిరింపులు
- ట్రంప్ తీరుపై ఇంటాబయటా విమర్శలు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 29 :** వీసా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. భారత విదేశాంగశాఖ అమెరికాతో సంప్రదింపులు జరిపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇదంతా కేవలం భారత్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిగానే గుర్తించాలి. ప్రజలు ఇబ్బంది పడుతున్నా, టెక్ కంపెనీలు సూచించినా ట్రంప్ వైఖరిలో మార్పు రాలేదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత్‌కు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు అన్ని రకాలుగా భారత్‌ను కష్టాల్లో పడేశాయి. హెచ్ 1 బీ వీసాల ఫీజు భారీగా పెంచేశారు. హెచ్ 1బీ వీసా ఫీజులను ఏడాదికి 1,00,000 డాలర్లు వరకు పెంచారు. హెచ్ 1బీ వీసాల రుసుము పెంచిన కొన్ని రోజులకు మరో దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ చిత్రాలపై ఏకంగా 100 శాతం టారీఫ్‌లు విధించారు. అమెరికాలో భారతీయ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో భారత చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇంతటితో ట్రంప్ కక్ష సాధింపు చర్యలు ఆగలేదు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే బియ్యంపై 50 శాతం టారీఫ్‌లు విధించారు. ఒకరకంగా చెప్పాలంటే 2025లో భారత్, అమెరికాల మధ్య సంబంధం టారీఫ్‌ల వివాదంతోటే గడిచిపోయింది. అవకాశం ఉన్న ప్రతీ దానిపై ట్రంప్ టారీఫ్‌లు వేసేశారు. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కోపంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కారణంతో ఆగస్టు నెలలో భారత్‌పై ఏకంగా 50 శాతం టారీఫ్‌లు వేశారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. రష్యాతో ఇండియా ఆయిల్ కొనుగోలు చేయటం ఇష్టం లేని ట్రంప్ బెదిరింపులకు దిగారు. రష్యాతో వ్యాపారం మానుకోకపోతే మరిన్ని టారీఫ్‌లు వేస్తామని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో గత ఆగస్టు నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడ మోదీ, పుతిన్, జిన్ పింగ్ కలిశారు. పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కలవటంపై ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో సెప్టెంబర్ 5వ తేదీన క్రిప్టిక్ మెసేజ్ పెట్టారు. డిసెంబర్ 8వ తేదీన అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ అమెరికాలోని రైతులకోసం మల్టీ బిలియన్ డాలర్ రిలీఫ్ ప్యాకేజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్, ఇతర ఆసియా దేశాలనుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై విమర్శలు సైతం గుప్పించారు. ఇతర దేశాల నుంచి వస్తువుల్ని అమెరికాలోకి దిగుమతి చేసుకో వటం స్థానిక ఉత్పత్తిదారులకు సవాలుగా మారిందని అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను రక్షించటం కోసం, దిగుమతుల కు అడ్డు కట్ట వేయటం కోసం భారీ మొత్తంలో టారిఫ్‌లు వేస్తామని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఎంతో అవస రమైన జాతీయ ఆస్థి. అమెరికాకు వెన్నెముక లాంటి వారని అన్నా రు. రష్యా, చైనాలను తమ దారిలోకి తెచ్చుకోవడానికి భారత్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


ట్రంప్ తీసుకునే నిర్ణయాల వల్ల అమెరికాకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే సంబం ధాలు మరింత దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. అయితే, రెండు దేశాల మధ్య భవిష్యత్ వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. 2026లో అయినా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అమెరికన్లు కూడా ఆశగా ఉన్నారు. ముఖ్యంగా వీసా వ్యవహారాలపై సరైన నిర్యం తీసుకోకుంటే తక్షణ ఇబ్బందులు తప్పేలా లేవు.

# ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రం

- వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచే రోజు
- 30న ముక్కోటి ఏకాదశి పర్వదినం



**తిరుమల, డిసెంబర్ 29 :** ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం దగ్గర భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని విశ్వాసం ఉంది.ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. అటు తర్వాత జపం, ధ్యానం. విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకం గా ఉన్నా మహావిష్ణువు వారి కోసం తన వైకుంఠ ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుజేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరువతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణువు శరణ-ువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును ముర సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చిని జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం.ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వాకు భోజనం రుచి తెలుస్తుంది. గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు.



# ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ ప్రమాదం

- సజీవదహనం అయిన చంద్రశేఖర్
- బ్యాగులో నోట్లకట్టలు, బంగారం లభ్యం

**విశాఖపట్నం, డిసెంబర్ 29 :** అనకాపల్లి జిల్లా ఎలమంచిలి వద్ద ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగి, ప్రమాదంలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ (70) అనే వ్యక్తి సజీవ దహనమయ్యారు. మృతుడికి చెందిన బ్యాగులో భారీగా నగదు, బంగారం ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. చంద్రశేఖర్ కుటుంబసభ్యుల సమక్షంలో బ్యాగును తెరిచి చూడగా రూ. 5.80లక్షల నగదు, బంగారం ఉన్నట్లు నిర్ధరించారు. చాలా వరకు నోట్లకట్టలు కాలిపోయి ఉన్నాయి.



# ద్వారకా తిరుమలలో ఏకాదశి ఏర్పాట్లు

## వేకువజామున 5గంటల నుంచే ఉత్తరద్వార దర్శనం

**ఏలూరు, డిసెంబర్ 29 :** ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం అవుతుంది. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనాన్ని చేసుకుంటారు.ద్వారకా తిరుమలకు ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలి రానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు కూడా వచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది స్వామివారి గిరిప్రదక్షిణ, నిజరూప దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. స్వామివారి గిరి ప్రదక్షిణ ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుంది. ఆలయ మొదటి మెట్టు వద్ద నుంచి ఈ ప్రదక్షిణ మొదలుకానుంది. గిరి ప్రదక్షిణ ఆలయం నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకు కొనసాగుతుంది. గిరి ప్రదక్షిణ నేపథ్యంలో భక్తులు స్వామి వారి ఆలయం చుట్టూ పాదయాత్ర చేస్తారు. ఆలయంలో స్వామి వారి నిజరూప దర్శనం ఈనెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉండనుంది. ఈ క్రమంలో భక్తులు స్వామి వారి పూజా అర్చనలో పాల్గొని నిజరూపాన్ని ప్రత్యక్షంగా దర్శించుకునే అవకాశాన్ని ఆలయ అధికారులు కల్పిస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం

# అధ్యక్షురాలిగా పొన్నం సునీత

**కరీంనగర్, డిసెంబర్ 29 :** తిమ్మాపూర్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాని ఆదివారం మండల సర్పంచుల ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తాట్ల తిరుపతి, గౌరవ సలహాదారురాలిగా సురం స్వప్న మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మామిడి మమతా సతీష్, కనకం లక్ష్మి కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆవుదుర్తి రామకిషన్, కోశాధికారిగా గోదరి శోభారాణి రవి, కార్యదర్శిగా పిస్క సౌజన్య కృష్ణ కిషోర్, దుర్గం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక ఆంజనేయులు, గుజ్జుల శ్వేత ప్రణీత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే పెద్దపల్లి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిగా తలారి స్వప్న-సాగర్ (అందుగులపల్లి) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గుమ్మడి సోని విజయ్ (రాగినేడు), ఉపాధ్యక్షులుగా గున్నాల రాములు (కనగర్తి), కేశవేని అశోక్ యాదవ్ (మూలసాల), గుర్రం శ్రీధర్ (మారేడుగొండ), వంగ అనిల్ (భోజన్నపేట), పాలేటి వెంకటేష్ యాదవ్ (గౌరెడ్డిపేట), ప్రధాన కార్యదర్శులుగా గాజుల ప్రవీణ్ కుమార్ (కాపులపల్లి), కొండ శ్రావణ్ కుమార్ (రంగాపూర్), సిలారపు శ్రీనివాస్ (కొత్తపల్లి), కార్యదర్శులుగా మిట్టపల్లి వెంకటేష్ (పెద్దబొంకూర్) సుద్దాల స్రవంతి వెంకటేష్ (అప్పన్నపేట), బీటి అశోక్ (కుర్మపల్లి), తొగరి రాజేశం (గుర్రాంపల్లి), సంయుక్త కార్యదర్శులుగా పర్స లక్ష్మి-శంకరయ్యయాదవ్ (పెద్దకల్వల), బోయిని ఓదెలు (గోపయ్య పల్లి), కోశాధికారిగా పంబాల రాజు యాదవ్ (బొంపల్లి), సహాయ కార్యదర్శి గా కలవేని అనూష (ముత్తారం), మడుపు జయలక్ష్మి (రాంపల్లి)ని ఎన్నుకున్నారు.



# కమ్యూనిస్టులను లేకుండా చేసే కుట్ర

## కేంద్రం తీరుపై మండిపడ్డ కూనంనేని

**హైదరాబాద్, డిసెంబర్ 29 :** కమ్యూనిస్టులు లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను సైతం డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడం దుర్మార్గంమైన చర్యని, కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రజల కోసమా అదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా తేల్చాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆపరేషన్ల పేరుతో సాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా తిరుగుబాటు ఉద్యమాలు తప్పవన్నారు. మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన అపార ఖనిజ సంపదను కాజేసేందుకు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను హతమార్చడం సరైంది కాదన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ ఈ మారణ హోమానికి తెగబడటం పైచాచికమని, మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఆధ్యాత్మిక శోభతో బీరప్ప దేవాలయ పరిసరాలలో పండుగ వాతావరణం

### 263 డివిజన్ తెల్లాపూర్‌లో మల్లన్న జాతర బోనాలు మహోత్సవాలు

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** జాతరలు బోనాలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు సాక్ష్యాలు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా బోనాలు జరుపుకుంటారు. అంతే భక్తిశ్రద్ధలతో సంతోషంగా గడిపే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనసును పులకరింపజేస్తాయి. పఠాన్ చెరువు నియోజకవర్గం 263 డివిజన్ తెల్లాపూర్‌లో ఆదివారం సోమవారాలలో మల్లన్న, కొండ పోచమ్మ అమ్మవార్ల బోనాలు జాతర అంగరంగ వైభవంగా తెల్లాపూర్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ జాతర ఉత్సవాలను ప్రజలు కులమతాలకతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని సంగం అధ్యక్షుడు కంజర్ల మల్లేష్ కురుమ కమిటీ మరియు కుల సంఘం పెద్దలు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ బీరప్ప గుడి పరిధిలో ఉన్న మల్లన్న దేవాలయంతో పాటు ఇతర దేవతామూర్తుల మందిరాలను కలర్ ఫుల్ లైటింగ్స్‌తో ఏర్పాటు చేయడం చూపరులను ఆకర్షింప చేస్తుంది. ఈ సంస్కృతి సంప్రదాయాలను నేటి తరం వారికి వివరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జాతరలో పాల్గొన్న నాయకులు ఆహ్వానితులు పేర్కొ న్నారు. నేటి యువత పాశ్చాత్తా నాగరికత వైపు దృష్టి సారిస్తుండడంతో మన ఆచార వ్యవహారాలు అలవాట్లను విస్మరిస్తున్నారని ఈ సామాజిక సామూహిక ఉత్సవాలను గ్రామస్తులు అందరూ ఒకే దగ్గరకు చేరుకొని నిర్వహించుకోవడమే ఆ రోజుల్లో జాతరలుగా జరుపుకున్నారు.



## 271 డివిజన్‌లో కనీస మౌలిక వసతులు కల్పించాలి

### బిఆర్ఎస్ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరుతూ జిహెచ్ఎంసి ఉప కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్. జిహెచ్ఎంసి పరిధిలోని 271 డివిజన్, అమీన్ పూర్ ప్రాంతంలో ప్రజలు అనేకకాలంగా తీవ్రమైన మౌలిక సదుపాయాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా 271 డివిజన్ పరిధిలోని వాణి నగర్, పీఎన్ఆర్ కోకా కోలా ఎక్స్ రోడ్స్ ప్రాంతం, అమీన్ పూర్ పీజేఆర్ సుల్తాన్పూర్, నరేంద్ర నగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, నవ్య నగర్, ఐలాపూర్ తాండ నుండి బొమ్మనుకుంట వరకు ఉన్న కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ మరియు ఎలక్ట్రిసిటీ సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పై పేర్కొన్న కాలనీల్లో అనేక చోట్ల సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసమై ఉండటం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచిపోతూ, ప్రజలకు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, అలాగే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోంది. అదేవిధంగా అనేక ప్రాంతాలలో వీధి దీపాలు పనిచేయకపోవడం వల్ల రాత్రి సమయాల్లో భద్రతా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో, ఉప కమిషనర్ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని సంబంధిత అధికారులను ఆదేశించి 271 డివిజన్ అమీన్పూర్ పరిధిలోని వాణి నగర్ నుండి బొమ్మనుకుంట వరకు ఉన్న అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు మరియు ఎలక్ట్రిసిటీ సమస్యలను తక్షణమే పరిష్కరించవలసిందిగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ కమీషనర్ ను కోరారు.

## డిజిటల్ అరెస్ట్ కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్

**హైదరాబాద్:** డిజిటల్ అరెస్ట్ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను గుజరాత్‌కు చెందిన వారిగా గుర్తించారు. సయ్యద్ సోయబ్ జాహిద్, బెలిమ్ అనస్ రహీమ్‌ను అరెస్ట్ చేశారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన బాధితురాలిని నిందితులు భయపెట్టారు. ప్రభుత్వ, టెలికాం అధికారులుగా నటిస్తూ నకిలీ ఫోన్ కాల్స్ చేశారు. బాధితురాలి భర్తపై కేసులంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితురాలి నుంచి రూ. 1.95 కోట్లను కాజేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టగా.. మ్యూల్ బ్యాంక్ ఖాతాల నుంచి నగదు మళ్లించినట్లు గుర్తించారు. దేశవ్యాప్తంగా 22 కేసుల్లో నిందితుల పాత్ర ఉన్నట్లు తేలింది. నిందితుల బ్యాంక్ ఖాతాల నుంచి 3.5 కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. డిజిటల్ అరెస్ట్ పేరిట డబ్బులు అడిగితే ఎవరూ నమ్మవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పీర్జాదిగూడ 'బ్రాండ్'ను కాపాడండి

### మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

- గల్లీ నుంచి ఢిల్లీ దాకా మారుమోగిన పీర్జాదిగూడ పేరు
- సర్కిల్ ఆఫీసుగా కూడా నోచుకోని వైనంపై ధ్వజం
- పార్టీలకతీతంగా ఏకమై నగరాన్ని రక్షించుకుందాం: హరిశంకర్ రెడ్డి పిలుపు

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** సకల సౌకర్యాలతో, మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచి, గల్లీ నుంచి ఢిల్లీ దాకా గుర్తింపు పొందిన పీర్జాదిగూడ నగర 'బ్రాండ్' ఇమేజ్ ప్రస్తుతం ప్రమాదంలో పడిందని మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అగ్రభాగాన నిలిచిన అభివృద్ధి నేడు కుంటుపడుతోందని ఆయన విమర్శించారు.

**కళ్ళు లేని కబోదిలా కాంగ్రెస్ నేతల తీరు:**

నగర అభివృద్ధిపై ప్రస్తుత అధికార పార్టీ నేతలు కళ్ళు లేని కబోదిలా వ్యవహరిస్తున్నారని హరిశంకర్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన పీర్జాదిగూడ కార్పొరేషన్ కనీసం ఒక సర్కిల్ ఆఫీసు స్థాయి సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం శోచనీయమన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించిందని, ప్రజా సమస్యలు గాలికొదిలేశారని ఆయన మండిపడ్డారు.

**పార్టీలకతీతంగా పోరాడదాం:**


పీర్జాదిగూడ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. "రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలి. అభివృద్ధి విషయంలో అందరూ ఏకమవ్వాలి. పార్టీలకతీతంగా ఏకమై మన నగరాన్ని కాపాడుకోవాలి" అని ఆయన స్థానిక నేతలకు పిలుపునిచ్చారు.

**అభివృద్ధిలో వెనకడుగు వేయొద్దు**

గతంలో సకల సౌకర్యాలతో మోడల్ సిటీగా పేరుగాంచిన పీర్జాదిగూడ, ఇప్పుడు నిర్లక్ష్యానికి గురవుతోందని పేర్కొంటూ.. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని, నగరానికి రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీర్జాదిగూడ బ్రాండ్‌ను మసకబారనివ్వబోమని, ప్రజా పక్షాన పోరాటం కొనసాగిస్తామని హరిశంకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# మేడిపల్లి డివిజన్‌లో వేడెక్కిన రాజకీయం!

- టికెట్ల కోసం ఆశావహుల పడరాని పాట్లు
- గుంపుగా జతకట్టి సమావేశాలు.. చర్చలు..
- రిజర్వేషన్లపైనే నేతల కళ్లు.. అధిష్టానం వద్ద పైరవీలు
- పార్టీల బలాబలాలు.. ఓటర్ల నాడిపై ఉత్కంఠ



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

**స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే మేడిపల్లి డివిజన్ రాజకీయాలు సెగలు పుట్టిస్తున్నాయి. గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలు రంగంలోకి దిగడంతో డివిజన్ వ్యాప్తంగా ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా అన్నట్లుగా.. స్థానిక నాయకులు తమ ఉనికిని చాటుకోవడానికి, టికెట్ దక్కించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.**

**టికెట్ వేట.. అధిష్టానం వద్ద పైరవీల కోట!**

టికెట్ కోసం ఆశావహులు పడరాని పాట్లు పడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలోని 'పెద్దలను' ప్రసన్నం చేసుకోవడానికి ఉదయం నుంచే వారి నివాసాల వద్ద క్యూ కడుతున్నారు. తమ సేవా కార్యక్రమాలు, పార్టీ పట్ల ఉన్న విధేయతను వివరిస్తూ, ఈసారి తమకే అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ముఖ్యంగా యువ నాయకులు ఈసారి ఎలాగైనా బరిలో నిలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీ గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తుండగా, ఆశావహులు మాత్రం తమకే మెజారిటీ ఉందని నిరూపించుకునే పనిలో పడ్డారు.

**రిజర్వేషన్ గండం.. ఎవరికి కలిసొచ్చేనో?**

ప్రస్తుతం అందరి దృష్టి రిజర్వేషన్ల ప్రక్రియపైనే ఉంది. రిజర్వేషన్ ఖరారయ్యాక ఏ నాయకుడు ఏ గూటికి చేరుతారో, ఎవరు రేసులో ఉంటారో అనేది ఉత్కంఠగా మారింది. ఒకవేళ ఆశించిన రిజర్వేషన్ రాకపోతే ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కునే పనిలో కొందరు నేతలు ఉన్నారు. "రిజర్వేషన్ తేలాక అంతా ఒకే తాటిపై ఉంటారా?" అంటే సమాధానం వేచి చూడాల్సిందే. అసంతృప్త నేతలు స్వతంత్రులుగా బరిలోకి దిగితే ప్రధాన పార్టీల ఓట్ల బ్యాంకుకు గండి పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

**పార్టీల బలాబలాలు.. ఓటర్ల నాడి ఎటువైపు?**

డివిజన్‌లో పార్టీల మధ్య పోరు రసవత్తరంగా మారింది. పాలక పక్షం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను నమ్ముకుని ఓట్ల వేట మొదలుపెట్టింది. ప్రతిపక్షాలు: స్థానిక సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజా వ్యతిరేకతను ఆయుధంగా చేసుకుని ప్రజల్లోకి వెళ్తున్నాయి. ఓటర్లు మాత్రం చాలా మౌనంగా ఉన్నారు. గతంలో ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేరాయి? స్థానికంగా ఎవరికి పట్టు ఉంది? ఎవరు అందుబాటులో ఉంటారు? అనే అంశాలను బేరీజు వేస్తున్నారు. నాయకుల 'జోరు.. హుషారు' చూస్తుంటే ఈసారి పోరు నువ్వా-నేనా అన్నట్లుగా సాగడం ఖాయమనిపిస్తోంది. చివరకు ఓటరు దేవుడు ఎవరికి పట్టాభిషేకం చేస్తారో చూడాలి!


## ప్రజలకు మెరుగైన పాలన అందించండి

### మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

- డిప్యూటీ కమిషనర్ శైలజ ను కలిసిన మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి
- మేడిపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరిన మాజీ మేయర్
- డిప్యూటీ కమిషనర్ శైలజ స్పందిస్తూ ప్రతిరోజు మేడిపల్లి కార్యాలయంలో 2.30 నుండి 5.30 అందుబాటులో ఉంటానని హామీ



**బోడుప్పల్ సర్కిల్, రాజముద్ర న్యూస్:** ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ అభివృద్ధిలో బోడుప్పల్, చెంగిచెర్ల, మేడిపల్లి, పీర్జాదిగూడ లను అభివృద్ధి పదములో అగ్రగామిగా నిలబెట్టే విధంగా పరిపాలన సాగాలని మౌలిక వసతులు మెరుగుపరచాలని మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి డిప్యూటీ కమీషనర్



ను కోరారు. ఈ మేరకు సోమవారం జిహెచ్ఎంసి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ. శైలజ ను సర్కిల్ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ, మేడిపల్లి పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా సమయం కేటాయించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ సానుకూలంగా స్పందిస్తూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మేడిపల్లి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మాధుసూదన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, మల్లం వెంకటేష్ గౌడ్, యాసారం శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, బుల్లెట్ శంకర్, కోనేటి వెంకట్, అమర్ పటేల్, కిరణ్ నాయక్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి

- గ్రేటర్ పరిధిలోని మండలాల్లో అక్రిడిటేషన్ల సంఖ్య పెంచాలి
- ఐ అండ్ పిఆర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసిన టి యు డబ్ల్యూ (ఐ జె యు) బృందం



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** గ్రేటర్ హైదరాబాద్ పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా జీవోలో సవరింపులు చేపట్టాలని కోరుతూ టి యు డబ్ల్యూ జే (ఐజయు) బృందం సమాచార శాఖ కమిషనర్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సచివాలయం లోని ఐ అండ్ పిఆర్ కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ ప్రియాంక ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్ యు జె అధ్యక్షులు శిగా శంకర్, మేడ్చల్ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా, మేడ్చల్ కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల సత్యానారాయణలు సమస్యను ఆమెకు వివరించారు. గ్రేటర్ పరిధిలోని అర్బన్ మండలాలలో ప్రధాన పత్రికలలో నలుగురు నుంచి ఐదుగురు జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని ఆమెకు తెలిపారు. నూతన జీవో 252 ద్వారా ఒక పత్రికకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ పొందే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ముగ్గురు నలుగురికి అక్రిడిటేషన్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రూరల్ మండలాలతో కాకుండా అర్బన్ మండలాలను ప్రత్యేకంగా చూడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆవేదనలు దృష్టిలో ఉంచుకొని జీవోలో సవరణలు చేసి న్యాయం చేయాలని కోరారు.

**సానుకూలంగా స్పందించిన కమిషనర్**

గ్రేటర్ పరిధిలోని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై పౌర సంబంధాలు అండ్ సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక సానుకూలంగా స్పందించారు. అర్బన్ మండలాలలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వడం న్యాయ బద్ధమైనదని తెలిపారు. త్వరలోనే మంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీని ఇచ్చారు.



## బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులుగా ఎర్ర సోమిరెడ్డి

**ఆత్మకూర్(ఎం), రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం బిఆర్ఎస్ పార్టీ సర్పంచుల పోరం మండల అధ్యక్షులుగా ఎర్ర సోమిరెడ్డిని బిఆర్ఎస్ సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎర్ర సోమిరెడ్డి మాట్లాడుతూ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సహకారంతో నన్ను గుర్తించి సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సర్పంచ్లకు అన్ని విధాలుగా నా పూర్తి సహాయక సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బిస్ చందర్ గౌడ్, సర్పంచ్ ఫోరంలో ఉపాధ్యక్షులు నర్రముల లింగయ్య, ప్రధాన కార్యదర్శి ఎరుకల యతీశ్వర్ గౌడ్, కార్యదర్శి సుంకరి మంజుల, కోశాధికారి కొంగరి యాదగిరి, కార్యవర్గ సభ్యులు బిస్ ధనలక్ష్మి, గడ్డం ముత్తమ్మ,సంగపాక శ్రీవాణి,సుధగాని కళావతి లింగయ్య, కట్టెకోల శ్రీహరి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు భాషబోయిన ఉప్పలయ్య, ప్రతికంట పూర్ణచంద్ర రాజ్, యాస ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## రామచంద్రాపురం డివిజన్‌ను సర్కిల్‌గా మార్చాలి

### కార్పొరేటర్ పుష్ప నగేష్

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** సోమవారం హైదరాబాద్‌లో ఉన్న జిహెచ్ఎంసి బల్దియా కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపురం డివిజన్ ని రామచంద్రపురం సర్కిల్ గా ఏర్పాటు చెయ్యాలి అని డిమాండ్ చేస్తూ, ఈరోజు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు,రామచంద్రపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులను కోరడం జరిగింది. రామచంద్రపురం జేఏసి సభ్యులతో కలిసి డి లిమిటేషన్ వల్ల పలు సర్కిల్ లు మారాయి అని,అందులో భాగంగా రామచంద్రపురం డివిజన్ ని పటాన్ చెరువు,రామచంద్రపురం సర్కిల్ నుంచి నూతన సర్కిల్ అయినటువంటి అమీన్ పూర్ లో మార్చడం వల్ల, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని, ప్రజల అభిప్రాయం మేరకు పరిపాలన పరంగా ఇబ్బందులు పడతాము అని,అసలు రామచంద్రపురం డివిజన్ జిహెచ్ఎంసి లో మారి సుమారు 15 సంవత్సరలు అయింది. రామచంద్రపురం డివిజన్ ని కేంద్రంగా మార్చాలని, రామచంద్రాపురం డివిజన్,భారతి నగర్ డివిజన్,నూతన తెల్లాపూర్ డివిజన్ ని కలుపుకుని రామచంద్రాపురం డివిజన్ ను సర్కిల్ గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, వినతిపత్రం ఇవ్వడం జరిగింది.



# భారత వ్యవసాయంలో మేలి మలుపు

## 2014 నుండి 2025 వరకు వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు, రైతుల ప్రయోజనాలు

**2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన పదేళ్ల తర్వాత... అంటే 2025 నాటికి భారత వ్యవసాయ రంగం సంపూర్ణంగా మార్పు చెందింది. ఒకప్పుడు తక్కువ ఉత్పాదకత, ధరల అనిశ్చితి, దిగుమతులపై ఆధారపడే పరిస్థితుల్లో ఉన్న వ్యవసాయం ఇప్పుడు రికార్డు స్థాయి ఉత్పత్తి, రైతులకు భరోసా కలిగించే ఆదాయం, శాస్త్రీయ నవీనతతోపాటు దీర్ఘకాలిక స్వావలంబనతో కూడిన వ్యవస్థగా రూపాంతరం చెందింది.**

2025 ప్రత్యేకత ఏ ఒక్క పథకానికో లేక గణాంకాలకో పరిమితమైంది కాదు. గత పదకొండు సంవత్సరాల్లో వ్యవసాయ సంస్కరణలు సమగ్రంగా అమలు చేయడం వల్ల భవిష్యత్తుకు భరోసానిచ్చేలా వ్యవసాయం రూపురేఖలు మారిపోయాయి.

### మారిన దృష్టికోణం

2025లో ప్రారంభించిన ప్రధాన్ మంత్రి ధన్-ధాన్య కృషి యోజన వ్యవసాయ రంగంలో లక్ష్యబద్ధమైన, ఫలితాధారిత సంస్కరణలకు నాంది పలికింది. కేంద్ర బడ్జెట్ 2025-26లో ప్రకటించిన ఈ పథకం జూలైలో కేంద్ర మంత్రివర్గం ఆమోదం లభించింది. తక్కువ పనితీరు గల 100 జిల్లాలపై దృష్టి సారించింది. 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో, ఏటా 24,000 కోట్ల వ్యయంతో తక్కువ ఉత్పాదకత, నీటి కొరత, రుణ లోపాలను పరిష్కరించడమే లక్ష్యంగా దీనిని అమలు చేశారు. 11 మంత్రిత్వ శాఖల పరిధిలోని 36 వ్యవసాయ పథకాలను ఏకీకృతం చేయడం ద్వారా, విడివిడిగా అమలవుతున్న విధానానికి ముగింపు పలికారు. జిల్లా స్థాయిలో సమన్వయంతో అమలు చేయాలన్న విధానాన్ని తెచ్చారు. ఏడీపీతో స్ఫూర్తి పొందడం ద్వారా సాగునీరు, నిల్వలు, సాంకేతికత, శిక్షణ, సంస్థాగత రుణాలను ప్రాధాన్యంగా తీసుకొని, యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయంలో సమూల మార్పునకు తద్వారా ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఈ పథకాన్ని ఆచరణలోకి తెచ్చారు.

### పప్పు ధాన్యాలు :

స్వావలంబన దిశగా వ్యూహాత్మక అడుగు 2025లో 11,440 కోట్ల వ్యయంతో దిగుమతులను తగ్గించేందుకు పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరతా చర్యలకు శ్రీకారం చుట్టారు. 2030-31 నాటికి 350 లక్షల టన్నుల పప్పుధాన్యాల ఉత్పాదకత, 310 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యంగా నిర్ణయించారు. తొలిసారిగా, కందులు, మినుములు, మసూర్ సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తూ నాలుగేళ్ల పాటు 100 శాతం మద్దతు ధరతో పప్పుధాన్యాలను కొనుగోలు చేయడానికి హామీ ఇచ్చారు. సుమారు 2 కోట్ల రైతులకు లబ్ధి చేకూర్చడమే కాకుండా, విలువాధారిత వ్యవస్థల్ని బలోపేతం చేసి, ఆదాయ స్థిరత్వంతోపాటు పోషకాహార భద్రతను కూడా పెంపొందిస్తోంది12.


### వ్యవసాయం-పరిశ్రమ అనుసంధానం : పత్తి మిషన్

కేంద్ర బడ్జెట్ 2025-26లో ప్రకటించిన అయిదేళ్ల పత్తి మిషన్... ముఖ్యంగా పొడవు పింజ పత్తి ఉత్పాదకతను పెంచేందుకు శాస్త్ర సాంకేతికత ఆధారంగా రైతులకు మద్దతు ఇస్తుంది. నాణ్యమైన పత్తి సరఫరాను నిర్ధారించడం ద్వారా, ఎంఎస్ఎంఈల ఆధారిత భారత జౌళి రంగాన్ని బలోపేతం చేసి, వ్యవసాయాన్ని పారిశ్రామిక పోటీ సామర్థ్యానికి కీలక ప్రేరకంగా మార్చే 5 ఎఫ్ దార్శనికతను ఈ ఈ పథకం ముందుకు తీసుకుపోతున్నది. 80 శాతం నాణ్యమైన పత్తి ఎంఎస్ఎంఈల ద్వారా సరఫరా అవుతున్నది. వీటి నుంచి నాణ్యమైన పత్తి సరఫరా ఉండేట్లుగా ఈ పథకం చూస్తుంది. వ్యవసాయ క్షేత్రాలను ప్రపంచ మార్కెట్లకు అనుసంధానం చేస్తూ పారిశ్రామిక పోటీలో వ్యవసాయాన్ని కూడా బలోపేతం చేసే దిశగా చూడాలన్నది లక్ష్యంగా ఉంది.



# చైనీస్ మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

## వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గాలిపటాలు ఎగురావేయడానికి చైనిస్ మాంజాను ఉపయోగించవద్దని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయించడం, నిల్వ చేయడం, వాడటంపై ప్రభుత్వం నిషేధం విధించిందని, పర్యావరణానికి, పక్షులకు ముఖ్యంగా ద్విచక్ర వాహన దారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ దారం గాలిపటాలు ఎగురవేసే సమయంలో మెడకు, శరీర భాగాలకు తగిలితే తీవ్రమైన గాయాలు కావడమే కాకుండా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని గతంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయని ఎస్పీ గుర్తు చేశారు. జిల్లాలోని ఫ్యాన్సీ షాపులు, గాలిపటాల విక్రయ కేంద్రాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని ఎక్కడైనా నిషేధిత చైనీస్ మాంజా కనిపిస్తే వెంటనే వాటిని సీజ్ చేయడమే కాకుండా సంబంధిత విక్రేతలపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కేవలం వ్యాపార లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఆమె వ్యాపారులకు సూచించారు. పర్యావరణ హితమైన, సురక్షితమైన నూలు (కాటన్) దారాలను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల ఇట్టి విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు, డైల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ జిల్లా ప్రజలను కోరారు.

# ప్రవేట్ ఆసుపత్రుల్లో వైద్యుల వివరాలు వెల్లడించాలి

- వైద్య ఖర్చులను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి
- క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం పాటించాలి
- వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి. స్వర్ణకుమారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వికారాబాద్, తాండూర్ ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులతో కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి. స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య పరిరక్షణకు ప్రవేట్ వైద్యులు కూడా సహకరించాలని, ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుల వివరాలు, అందించే సేవలు, అందించిన సేవలకు వసూలు చేసే చార్జీల వివరాలను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని పేర్కొన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రవేట్ ఆసుపత్రి వైద్యులు సాధు సత్యానంద్, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, ప్రదీప్ గౌడ్, అనిల్ కుమార్, ఎం జయ ప్రసాద్, రాజశేఖర్ ను కూడా పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రల సిబ్బంది వివరాలు, బడ్జెట్ కు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని తెలిపారు.

### ఎంఎల్హెచ్‌పితో సమీక్ష సమావేశం

మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జిల్లా పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పిలతో ఐడిఓసి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లలో అందించే సేవలు ఏ రోజువి ఆ రోజే ఆన్లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని రకాల సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవిత్ర, వరలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీంద్ర యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ల జీవో 252ను సవరించాలి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ ప్రభుత్వం మీడియా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీ కోసం విడుదల చేసిన జీవో 252 ను సవరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) సూర్యాపేట జిల్లా సమన్వయ కమిటీ సోమవారం గ్రీవెన్స్ డే లో జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. అనంతరం టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు మాట్లాడారు. అక్రిడిటేషన్ల జీవో 252 లో అభ్యంతరాలను సవరించాలని సూచించారు. డెస్క్ జర్నలిస్టులకు, రిపోర్టర్లకు వేర్వేరు రకాల కార్డులు జారీ చేయడం పట్ల ఫెడరేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది.అదే విధంగా వార, పక్ష,మాస దినపత్రికల అర్హతకు సంబంధించి జారీ చేసిన నిబంధనలో మార్పులు తీసుకురావాలని కోరారు. వార పత్రికలకు కనీసం 45 సంచికలు పక్షపత్రికలకు కనీసం 22 సంచికలు, మాసపత్రికలకు కనీసం 11 సంచికలు సమర్పించాలన్న నిబంధనను తొలగించాలని కోరారు. కలెక్టర్కు వినతి పత్రం అందజేసిన వారిలో సూర్యాపేట జిల్లా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పాల్వాయి జానయ్య, కో కన్వీనర్లు ముషం హరి ప్రసాద్,లింగాల సాయిబాబా,తాందార్ పల్లి శ్రీనివాస్, నందిపాటి సైదులు, గూడపూరి ప్రభాకర్ (ప్రభు), కొంగల సతీష్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ జర్నలిస్టు జేఏసీ రాష్ట్ర కో కోఆర్డినేటర్‌గా కీర్తి సంతోష్ రాజ్ నియామకం




**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ జర్నలిస్టు జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 33 మందిని నియమించింది. హైదరాబాద్ ప్రాంతం నుంచి కీర్తి సంతోష్ రాజ్ ను నియమిస్తున్నట్టు తెలంగాణ జర్నలిస్టు జేఏసీ ప్రకటించింది. ఈ సందర్భంగా కీర్తి సంతోష్ రాజ్ మాట్లాడుతూ... జర్నలిస్టు వృత్తి కత్తి మీద సాము లాంటిదని వార్తలు రాయాలంటే అధికారులకు, రాజకీయ నాయకులకు జేజేలు కొట్టి వార్త రాస్తే ఆనంద పడతారని, వాళ్లు చేసే అన్యాయాలు అక్రమాలపై ప్రశ్నిస్తే నోటికొచ్చినట్టు మాట్లాడతారని తప్పుడు కేసులు పెడతారని అలాంటి పత్రిక రంగంలో పనిచేస్తున్న పాత్రికేయ మిత్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రశ్నించే గొంతుకగా పాత్రికేయుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలబడతానని, పాత్రికేయ కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం, ఉచిత విద్యను అందించాలని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో పత్రికా విలేకరులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ని ప్రవేశపెట్టాలని, జర్నలిస్టులపై జరిగే దాడులకు ప్రత్యేక చట్టం ఈ అసెంబ్లీ సమావేశాల్లో తీసుకురావాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైల్లో ఉచిత ప్రయాణాన్ని కొనసాగించే విధంగా ప్రోత్సహించాలని, టోల్ టాక్స్ ల వద్ద జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన జీవోను అమలు చేయాలని అక్రిడేషన్ విషయంలో ప్రభుత్వం జర్నలిస్టు యూనియన్ నాయకుల సూచనలు తీసుకోవాలని ఎవరో కొంతమంది చెప్పినంత మాత్రాన జర్నలిస్టులకు అన్యాయం చేయొద్దని, వార్తా సేకరణలో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం తప్పనిసరిగా అక్రిడేషన్ కార్డును ఇవ్వాలని, అక్రిడేషన్ లో కోత విధించొద్దని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పార్టీ కార్యకర్తల కంటే జర్నలిస్టులే తీసుకువెళ్తారని అలాంటి జర్నలిస్టులను ప్రభుత్వాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూడాలని ఈ సందర్భంగా కీర్తి సంతోష్ రాజ్ అన్నారు.

# నట్టల నివారణ మందుల పంపిణీ శిబిరాలను వినియోగించుకోవాలి



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహి స్తున్న ఉచిత నట్టాల నివారణ శిబిరాలను గొర్రెల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని రెడ్డి పేట సర్పంచ్ నాగులపల్లి రాజేందర్ సూచించారు. రెడ్డి పేట గ్రామంలో జరిగిన ఉచిత నటల నివారణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ శ్రీనివా సరావు, నారాయణ, రమేష్, సిబ్బంది ఆంజనేయులు, బల మని, గోపాలమిత్ర హారిక, స్వామి, మరియు గొర్రెల పెంపకం దారులు, రాములు, రాజయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

# క్రైస్తవులకు ప్రేమ విందు



**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం క్రైస్తవ సమాజాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలు మండల వైజ్ గా ఏర్పాటు చేశారు.అదేవిధంగా ఆత్మకూర్ మండలంలోను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన జిల్లా క్షలెక్టర్ మరియు జిల్లా మైనార్టీ కార్పొరేషన్ అధినములో మన మండల పరిధిలోని వివిధ గ్రామలొని చర్చి పాస్టర్స్ కలిసి నేడు క్రీస్మస్ వేడుకలను నిర్వహించుకోవడం జరిగినది. కార్యక్రమంలొ పాస్టర్స్ రెవ. ఇస్సాక్ పీటర్,పాస్టర్.పౌల్,పాస్టర్ దావిదు,చిన్న బాబు, దానియేల, ఆనందం, సొలొమోన్, ఆనంద్, పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రాగ్యా నాయక్ సేవలు మరువలేనివి



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** లంబాడి జాతికి మాజీ ఎమ్మెల్యే రాగ్య నాయక్ చేసిన సేవలు మరువలేనివని ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లూనావత్ పాండు నాయక్, ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ చివ్వెంల మండల అధ్యక్షులు, ధరావత్ వీరన్న నాయక్ లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ లో ఏఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోతు నాగు నాయక్ అధ్యక్షతన రాగ్య నాయక్ వర్ధంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ యూత్ అధ్యక్షులు లావుడ్య బాలాజీ నాయక్, సంఘం పట్టణ అధ్యక్షులు భూక్యా మహేష్ నాయక్,నాయకులు వివి నాయక్,అజయ్ నాయక్, బబ్బులాల్ నాయక్,ధారసింగ్ నాయక్,హరి నాయక్,రెడ్డి నాయక్,గుగులోతు వెంకన్న నాయక్,పాండు నాయక్,చత్రు నాయక్, రాజేష్ నాయక్,పాండు నాయక్,లోకా నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# ధరూర్ పోలీస్ స్టేషను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

- ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
- ప్రజల సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని ధరూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సోమవారం దరూర్ సర్కిల్ పరిధిలోని, బంట్వారం, కోట్ పల్లి పోలీస్ ధరూర్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందరరేగా ఆమె పోలీస్ స్టేషన్లలోని రికార్డులను, క్రైమ్ రిజిస్టర్లను పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను క్షుణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలను పర్యవేక్షించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో మాట్లాడుతూ కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా స్టేషన్‌లో ఎలాంటి ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకూడదని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరేలా చూడాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వారి సమస్యలను ఓపికగా విని తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేలా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధరూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.రఘు రాములు, బట్వారం ఎస్ఐ పి. విమల, కోట్‌పల్లి ఎస్ఐ ఎం. శైలజ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ అవార్డ్స్‌పై సమావేశం

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** జనవరి నెలలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ అవార్డ్స్ సంబంధించిన జిల్లా స్థాయి సమావేశము జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, పోలీస్ డిపార్ట్మెంట్, మెడికల్ డిపార్ట్మెంట్, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్, మున్సిపల్ డిపార్ట్మెంట్ సంబంధించినటువంటి జిల్లా స్థాయి అధికారులు పాల్గొనడం జరిగింది. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్ అవార్డ్స్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా సఫలీకృతం చేయాలని సూచించడం జరిగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కావలసిన సూచనలు దిశా నిర్దేశము చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.



# గ్రామ పంచాయతీ అభివృద్ధే నా ధ్యేయం

## పేరూరు సర్పంచ్ గొడ్డే సరోజిని దేవి

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు పంచాయతీలో సర్పంచ్ గొడ్డే సరోజినీ దేవి వార్డు సభ్యులతో సోమవారం ముఖ్య సమావేశం నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీలు,విద్యుత్,మంచినీటి సరఫరా, కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు, మహిళ స్వయం శక్తి సంఘాల భవనం ఏర్పాటు,పలు సమస్యలపై వార్డు సభ్యులు అందరూ అందుబాటులో ఉండి పరిష్కరించాలని అన్నారు. పేరూరు పంచాయతీ ఇన్చార్జి సెక్రెటర్ అశోక్ మాట్లాడు..తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ప్రతి గ్రామపంచాయతీ గ్రామాలలో ఒక్కొక్క భవనమునకు 10 లక్షల రూపాయలు మహిళ స్వయం శక్తి సంఘాల భవనాల నిర్మాణం కొరకు విడుదల చేయడం జరిగిందని, పేరూరు, చిన్నగొల్లగూడెం గ్రామంలో భవన నిర్మాణం స్థలం ఏర్పాటు కోసం,2 వందల చదరపు గజాల గ్రామకంఠ స్థలం కేటాయించాలని,అట్టి స్థలం కోసం ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూరియా దొరకదు.. ఆన్లైన్ రాదు

## నేలకొండపల్లి రైతులకు అగచాట్లు!

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండలంలో సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం నాట్లు వేసే సమయం కావడంతో పొలాలకు యూరియా ఎంతో అవసరం. అయితే, యూరియా పంపిణీలో ఆన్‌లైన్ సమస్యలు అడ్డుపడుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ పోర్టల్ తెరుచుకోవడం లేదని వ్యవసాయ అధికారులు చెబుతుండగా, ఆన్‌లైన్ నమోదు పూర్తి కాకుండా యూరియా ఇచ్చే ప్రసక్తే లేదని సొసైటీ సిబ్బంది ఖరాకండిగా చెబుతున్నారు. మరోపక్క వర్షాలకు అనుగుణంగా నాట్లు వేసేందుకు సిద్ధమైన రైతులు యూరియా దొరక్క అగచాట్లు పడుతున్నారు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు చేతికి వచ్చే కీలక సమయంలో ఇలాంటి సాంకేతిక కారణాలతో ఆలస్యం చేయడం తమను నష్టాల్లోకి నెట్టడమేనని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఆన్‌లైన్ సమస్యను పరిష్కరించి రైతులకు సకాలంలో యూరియా అందేలా చూడాలని మండల రైతాంగం కోరుతోంది.



## కువైట్‌లో వీసా, రెసిడెన్సీ అనుమతుల కోసం
# ఇ-సర్వీస్ ప్రారంభం

**కువైట్ :** విదేశీ కార్మికులకు వీసా, నివాస విధానాలను సరళీకృతం చేయడానికి కువైట్ కొత్త ఎలక్ట్రానిక్ సేవలను ప్రారంభించింది. విదేశీ ఉద్యోగులకు త్వరిత, మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇకపై వీసా పునరుద్ధరణ, రెసిడెన్సీ పర్మిట్ల బదిలీ వంటి సేవల కోసం విదేశీయులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా.. అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పొందవచ్చ ని తెలియజేసింది. జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెసిడెన్సీ సమన్వయంతో ఈ సేవలను అభివృద్ధి చేసినట్లు జనరల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ నూతన సంస్కరణలను కువైట్ ఇమిగ్రేషన్ వ్యవస్థ పరిశీలిస్తోందన్నారు. ఈ మార్పులు కువైట్ పౌర, ప్రైవేట్ రంగాలలో పనిచేస్తున్న విదేశీ కార్మికులకు ప్రయోజనం చేకూరుస్తాయని.. వీసా పునరుద్ధరణ, ఉద్యోగ, నివాస మార్పుల సమయంలో వారు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు తగ్గుతాయన్నారు. ఇప్పటివరకు విదేశీ కార్మికులు తమ నివాసాలను మార్చాలంటే అధికారుల ఆమోదం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉండేదని.. ఇకపై ఆ సమస్య ఉండదని తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం విదేశీయులు, సందర్శకులకు ఆరోగ్య బీమా తప్పనిసరి చేస్తున్నట్లు వెల్లడించారు.



## విశ్రాంతి తీసుకుంటూనే
# సజీవ దహనమై..
### నర్సింగ్‌హోమ్‌లో 16 మంది మృతి

**ఇండోనేసియా :** ఇండోనేసియాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఆ దేశంలోని సులవేసి ద్వీపంలోని నర్సింగ్‌హోమ్‌లో ఈ ఘటన చోటుచేసుకోగా.. 16 మంది సజీవ దహనమయ్యారని సోమవారం స్థానిక అధికారులు వెల్లడించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఆదివారం రాత్రి ఈ ప్రమాదం గురించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందింది. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. కానీ అప్పటికే మంటల ధాటికి 16 మంది మృతి చెందారు. మంటలు చెలరేగిన సమయంలో నర్సింగ్‌హోమ్‌లో వృద్ధులు విశ్రాంతి తీసుకుంటున్నారని, ఆ గదుల్లోనే వారు సజీవ దహనమయ్యారని అధికారులు వెల్లడించారు. 12 మందిని కాపాడినట్లు చెప్పారు. ఈ ఘటన దృశ్యాలు స్థానిక మీడియాలో వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



## జపాన్ కామెంట్లతో..
# చైనా-తైవాన్ మధ్య ఉద్రిక్తతలు

**చైనా :** తైవాన్‌ను రక్షించేందుకు అవసరమైతే తాము రంగంలోకి దిగుతామని జపాన్ ప్రధాని సనాయె తకాయిచి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఉద్రిక్తతలను రాజేశాయి. తాజాగా చైనా దళాలు తైవాన్‌ను చుట్టుముట్టి భారీఎత్తున యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే ఆ దేశ వాయుసేన, నేవీ, రాకెట్ ఫోర్స్ దళాలు తైవాన్ సమీపంలోకి తరలించే పనిలో బీజింగ్ నిమగ్నమైంది. తాజాగా చైనాకు చెందిన పీఎల్ఏ ఈస్టర్న్ థియేటర్ కమాండ్ సీనియర్ కర్నల్ షి యీ మాట్లాడుతూ తాము 'జస్టిస్ మిషన్ 2025' పేరిట తైవాన్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు చేయనున్నట్లు ప్రకటించారు. సముద్ర, గగనతల యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకోవడం, ద్వీప సమూహాల బయట బ్లాకేడ్స్ నిర్వహించడం వంటివి చేయనున్నట్లు చెప్పారు. "తైవాన్‌లోని వేర్పాటువాద శక్తులకు ఇది బలమైన హెచ్చరిక జాతీయ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి చైనా తగిన చర్యలు తీసుకొంటుంది" అని చెప్పారు. మరోవైపు తైవాన్‌కు ఆయుధాలు విక్రయిస్తామని అమెరికా ప్రకటించిన కొన్ని రోజుల్లోనే చైనా తీవ్రంగా స్పందించింది. ఇప్పటికే బీజింగ్ 20 అమెరికా రక్షణ రంగ సంస్థలు, 10 మంది ఎగ్జిక్యూటివ్‌లపై ఆంక్షలు విధించింది.

## భారతీయుల వర్క్ పర్మిట్లు
# రద్దు చేయాలి
### విషం కక్కిన బంగ్లాదేశ్ ఇంకిలాబ్ మోంచా



**బంగ్లాదేశ్ :** విద్యార్థి నాయకుడు, ఇంకిలాబ్ మోంచా నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. హాదీ హత్య నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వంపై మండిపడుతోన్న ఇంకిలాబ్ మోంచా.. తాజాగా భారతీయులపై విషం కక్కింది. బంగ్లాలో ఉన్న భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు యూనస్ ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వడం గమనార్హం. హత్యకు న్యాయం చేయాలని కోరుతూ ఇంకిలాబ్ మోంచా పలు డిమాండ్లు చేసింది. తమ నాయకుడి మరణానికి కారణ మైన నిందితులు, వారికి సహకరించిన వారిని 24 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో నివాసం ఉంటున్న భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దు చేయాలని కోరింది. షేక్ హసీనాను అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే.. ఆ దేశంపై అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు వేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తమ ఫేస్‌బుక్ ఖాతాలో దీనిపై పోస్ట్ చేసింది. ఈ సందర్భంగా సోమవారం భారీఎత్తున ఆం దోళనలకు పిలుపునిచ్చింది. భారత వ్యతిరేకి అయిన 32 ఏళ్ల ఉస్మాన్ హాదీపై డిసెంబరు 12న ఢాకాలో కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడి ని సింగపూర్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ 18న మరణించాడు. హాదీ మృతి వార్త తెలియగానే బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. మీడియా సంస్థలు, అవామీ లీగ్ కార్యాలయాలపై నిరసనకారులు దాడులు చేశారు. ఈ క్రమంలోనే హాదీని చంపిన ఇద్దరు వ్యక్తులు భారత్‌లోకి ప్రవేశించినట్లు బంగ్లా మీడియాలో కథనాలు వచ్చాయి. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది.

# ఢిల్లీలో రెడ్ అలర్ట్..
### విమాన సర్వీసులకు అంతరాయం



**న్యూఢిల్లీ :** దేశ రాజధానిని పొగమంచు కప్పేసింది. అతి సమీపంలోని వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఎదురవడంతో వాతావరణ శాఖ దిల్లీలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి వాతావరణం దారుణంగా మారడంతో రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. సోమవారం తెల్లవారుజామున దిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ 403గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వివేక్ విహార్ (460), ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్ (444) ఏక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తీవ్రమైన జోన్‌లోకి ప్రవేశిస్తున్నందున నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తున్నామన్నారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో రైలు, విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన పొగమంచు వల్ల రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. దిల్లీ విమానాశ్రయం సైతం ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. ప్రయాణికులు విమానాల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం అన్ని విమానయాన సంస్థలకు కస్టమర్ సపోర్ట్ ఫోన్ నంబర్‌లను విడుదల చేసింది.

# పీర్జాదిగూడలో ఘనంగా డిప్యూటీ కమిషనర్ల సన్మాన కార్యక్రమం

- ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న త్రిలేశ్వరరావుకు వీడ్కోలు
- నూతన డిప్యూటీ కమిషనర్‌గా శైలజకు సాదర స్వాగతం
- మాజీ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కాకుండా, మౌలిక వసతుల కల్పనలో అహర్నిశలు కృషి చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న అధికారులకు గౌరవం దక్కడం అభినందనీయమని మాజీ మేయర్ అమర్ సింగ్ కొనియాడారు. పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలో సుదీర్ఘ కాలం సేవలందించి, బదిలీపై వెళ్తున్న మాజీ కమిషనర్ త్రిలేశ్వరరావుకు వీడ్కోలు పలుకుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజకు స్వాగతం పలుకుతూ శుక్రవారం ఒక ప్రత్యేక "ఆత్మీయ సన్మాన" కార్యక్రమం నిర్వహించారు.

**విలీన ప్రక్రియతో కొత్త మార్పులు:**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో పీర్జాదిగూడ నగరపాలక సంస్థ రెండు డివిజన్లుగా రూపాంతరం చెంది బోడుప్పల్ సర్కిల్‌లో కలిసింది. ఈ క్రమంలో బోడుప్పల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా ఏ. శైలజ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీర్జాదిగూడ కమిషనర్‌గా విశేష సేవలు అందించిన త్రిలేశ్వరరావు పదోన్నతిపై బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

**అధికారుల సేవలు అమోఘం: అమర్ సింగ్**

ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ, త్రిలేశ్వరరావు తన పదవీ కాలంలో స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించారని, ముఖ్యంగా ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శైలజ కూడా అదే స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఇరువురు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, కె. సుభాష్ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, ఇర్ఫాన్ ఖాన్, సీనియర్ నాయకులు బండారి రవీందర్, బండి సతీష్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, కుర్ర శ్రీకాంత్ గౌడ్, అలువాల దేవేందర్ గౌడ్, యాసారం మహేష్, కె.వి గౌడ్, ఎస్. సుధాకర్ తదితరులు పాల్గొని అధికారులను అభినందించారు.







## ఆరావళి పర్వతాల కొత్త నిర్వచనంపై దుమారం
### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ :** పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచంగా ఉన్న ఆరావళి పర్వతాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త నిర్వచనం జాతీయస్థాయిలో దుమారం రేపుతోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు స్పందించింది. గత నెల తాను ఇచ్చిన ఆదేశాలను సోమవారం నిలిపివేసింది. "కోర్టు ఆదేశాలు, కమిటీ సిఫార్సులు నిలిపివేయడం అవసరమని మేం భావిస్తున్నాం. కొత్త కమిటీ ఏర్పాటయ్యేవరకు ఈ స్టే అమల్లో ఉంటుంది" అని ధర్మాసనం పేర్కొంది. కొత్త నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది. దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని ఎప్పటినుంచో ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు... అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. దీనివల్ల హరియాణా, రాజస్థాన్, గుజరాత్, దిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే.

## నూతన సంవత్సర వేడుకలపై పోలీసు వారి సూచనలు పాటించాలి
### జిల్లా ఎస్పీ కే నరసింహా ఐపీఎస్



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ కే నరసింహా అన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీసులు కార్యచరణతో ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయంత్రం 6 గంటల నుంచి వాహనాల తనిఖీ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వాహనం నడుపుతూ మైనర్లు పట్టుపడితే మైనర్ పై వాహన యజమాని పై పై కేసులు నమోదు అవుతాయన్నారు పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లతో త్రిబుల్ రైడింగ్ వాహనాలు నడుపుతే వాహనాలు సీజ్ చేస్తామన్నారు ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు పెద్దలు అందరూ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇంట్లోనే నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు



## భారత ప్రభుత్వానికి లలిత్ మోదీ క్షమాపణలు

**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ బ్రిటన్‌కు పరారైన ఐపీఎల్ ఫౌండర్ లలిత్ మోదీ భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పారు. ఇటీవల విజయ్ మాల్యాతో కలిసి పార్టీ చేసుకున్న లలిత్ మోదీ మాట్లాడుతూ.. తాము అతిపెద్ద పలాయన వాదులమంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీంతో లలిత్ మోదీ, విజయ్ మాల్యా దేశాన్ని మోసం చేసి, పారిపోవడమే కాకుండా విదేశాల్లో భారత్‌ను బహిరంగంగా అపహాస్యం చేస్తున్నారని నెటిజన్లు మండిపడ్డారు. దీనిపై లలిత్ మోదీ స్పందిస్తూ.. తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని.. తనకు భారత ప్రభుత్వం అంటే చాలా గౌరవం ఉందని పేర్కొన్నారు. కాగా బ్యాంకులను మోసం చేసిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ దేశం నుంచి పరారై లండన్‌లో ఉంటున్న విజయ్ మాల్యా 70వ పుట్టిన రోజు ఇటీవల జరిగింది. దీనికి హాజరైన లలిత్ మోదీ మాల్యాతో వీడియో తీసుకుంటూ.. తాము అతిపెద్ద పలాయనవాదులుగా నిలిచామని వ్యాఖ్యానించారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. 'లెట్స్ బ్రేక్ ద ఇంటర్నెట్ డౌన్ ఇన్ ఇండియా ఎగెయిన్ (మళ్లీ భారత్‌లో ఇంటర్నెట్‌ను బద్దలు కొడదాం)' అని క్యాప్షన్ పెట్టారు. లలిత్ మోదీ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. దేశం నుంచి పారిపోయిన ఇద్దరు నిందితులను భారత్‌కు తిరిగి తీసుకురావడానికి బ్రిటన్ ప్రభుత్వంతో దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నామని తెలిపింది.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక



## ‘ఓం శాంతి శాంతి శాంతి’
# ఫస్ట్ సింగిల్ పోస్టర్

యంగ్ హీరోయిన్ ఈషా రెబ్బా, తరుణ్ భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా ‘ఓం శాంతి శాంతి శాంతి’ . ఇది మలయాళ హిట్ చిత్రం ‘జయా జయా జయా జయా హేకి’ రీమేక్‌గా రాబోతుంది. ఇందులో వైవాహిక జీవితంలో సమస్యలు, లింగ సమానత్వం వంటి అంశాలను హాస్యం, డ్రామాతో చూపిస్తారు. ఏఆర్ సజీవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ముఖ్యంగా ఈషా రెబ్బా పాత్ర బలమైన, స్వతంత్ర భావాలు కలిగిన యువతిగా ఉండబోతుందని టాక్. తరుణ్ భాస్కర్ తన ప్రత్యేకమైన టైమింగ్, నేచురల్ యాక్టింగ్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించనున్నాడని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా, ప్రమోషనల్ కంటెంట్ పెంచుకునేందుకు మేకర్స్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేశారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ సిన్నారి కోనా డిసెంబర్ 30న రాబోతున్నట్లు ప్రకటించారు. ఇందులో ఈషా రెబ్బా గోడపైకి ఎక్కి జీడి కాయలు కోస్తుండగా.. ఫ్యామిలీ మొత్తం ఆమెను ఆశ్చర్యకరంగా చూస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.




# పాన్ ఇండియా మూవీలో హెబ్బా పటేల్!

టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో కొంతమంది అతి తక్కువ కాలంలోనే పాపులర్ అయి, ముందుకు దూసుకు వెళ్తూ ఉంటారు. అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. అలాంటి హీరోయిన్లలో హెబ్బా పటేల్ ఒకరు. హీరోయిన్ హెబ్బా పటేల్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. తన కెరీర్లో అనేక రకాల డిఫరెంట్ కథాంశాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. ఓదెల అనే విభిన్న కాన్సెప్ట్ సినిమాతో కూడా ఇరగదీసింది. అయితే అలాంటి హెబ్బా పటేల్ కు తాజాగా ఓ బంపర్ ఆఫర్ తగిలినట్లు సోషల్ మీడియాలో ఓ న్యూస్ వైరల్ అవుతోంది. హీరో నాని చేస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో హెబ్బా పటేల్ కు అవకాశం వచ్చిందట. ఈ మూవీలో ఐటెం సాంగ్ కోసం హీరోయిన్ వేటలో చిత్ర బృందం పడింది. మొదట తమన్నాను అనుకున్నారు. ఆ తర్వాత పూజా హెగ్డే పేరు పరిశీలనలోకి వచ్చింది. ఇప్పుడు ఈ పాన్ ఇండియా మూవీలో ఐటెం సాంగ్ చేసేందుకు హెబ్బా పటేల్ ను సంప్రదించేందుకు చిత్ర బృందం సిద్ధమైందట. హెబ్బా పటేల్ ఈ ఆఫర్ కు ఓకే చెబితే అధికారిక ప్రకటన రానుందట.

# ప్రభాస్ మ్యాష్ అప్ వీడియో విడుదల

ప్రభాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అభిమానులు ఉన్న విషయం తెలిసిందే. ఆయన సినిమా వస్తుందంటే ఇండస్ట్రీలో సందడి నెలకొంటుంది. మరికొన్ని రోజుల్లో ఆయన ’ది రాజాసాబ్’తో పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. దీని ప్రచారంలో భాగంగా చిత్రబృందం ఓ మ్యాష్‌అప్ వీడియో విడుదల చేసింది. ప్రభాస్ కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి ఆయన సినిమాలు విడుదలైనప్పుడు అభిమానుల చేసే సందడి, ఇండస్ట్రీలో ఉన్న సినీ ప్రముఖులు ఆయన గురించి పంచుకున్న మాటలు ఆ వీడియోలో చూపించారు. గతంలో ప్రభాస్ అభిమానులను ఉద్దేశించి చెప్పిన కొన్ని మాటలు ఎమోషనల్‌గా ఉన్నాయి. తనకు ఒక్క అభిమాని ఉన్నా చాలు అనుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు ఆయన చెప్పారు.




## రాజాసాబ్ నుంచి
# మరో ట్రైలర్ విడుదల
## సంక్రాంతి సినిమాలు హిట్ కావాలన్న ప్రభాస్

ది రాజాసాబ్’ విడుదలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచారాన్ని వేగవంతం చేస్తోంది. ఇప్పటికే పాటలు, ఓ ట్రైలర్‌ను రిలీజ్ చేసిన టీమ్ తాజాగా మరో ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రభాస్ హీరోగా మారుతి రూపొందించిన ఈ మూవీజనవరి 9న బాక్సాఫీసు ముందుకు రానున్న సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ హారర్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లు.’పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పూర్తిస్థాయి వినోదంతో ’ది రాజాసాబ్’ చేశాం. ఈ సినిమా విషయంలో చాలా ఆత్రుతగా ఉన్నా. అది కూడా సంక్రాంతికి వస్తోంది. సంక్రాంతి సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ అవ్వాలి. మాది కూడా అయిపోతే మరింత సంతోషం అన్నారు ప్రభాస్.

ఆయన కథానాయకుడిగా నటించిన ’ది రాజాసాబ్’ విడుదలకు ముందస్తు వేడుక హైదరాబాద్‌లో జరిగింది. మారుతి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్, జరీనా వహాబ్ ముఖ్యపాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ ‘ఈ సినిమాలో సంజయ్‌దత్ కనిపించిన విధానం అద్భుతం. ఇది నానమ్మ మనవడి కథ. నానమ్మని చూస్తూ నా సన్నివేశాల్ని మరిచిపోయేవాణ్ని. అంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు జరీనా. ఇందులో నాతోపాటు మా నానమ్మకూడా ఓ హీరో. ముగ్గురు అందమైన హీరోయిన్లు ఇందులో ఉన్నారు. ఈ సినిమాకి అనుకున్న బడ్జెట్ ఒకటి, అయ్యింది మరొకటి. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ దేనికీ వెనకాడకుండా సినిమాని పూర్తి చేశారు. ఆయన నిజమైన హీరో ఈ సినిమాకు. ఇలాంటి సినిమాకి ఆ స్థాయిలో రీరికార్డింగ్ చేసే సంగీత దర్శకుడు తమన్ ఒక్కరే అనిపించింది. మారుతి మూడేళ్ల కష్టం, బాధ్యత ఈ సినిమా. సంక్రాంతికి చాలా సినిమాలొస్తున్నాయి. ఎప్పటికైనా సీనియర్లు సీనియర్లే. వాళ్ల నుంచే మేం నేర్చుకున్నాం‘ అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ ‘కథానాయకుడు ప్రభాస్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కారణంగానే ఈ సినిమాతో ఇంత దూరం ప్రయాణించాం. నిర్మాత జీవితాన్ని పెట్టారు ఈ సినిమాకి. థియేటర్‌కి వచ్చినవాళ్లకు మేం ఎంత కష్టపడ్డామో కనిపిస్తుంది. రాజమౌళికి ప్రతి దర్శకుడు చాలా రుణపడి ఉంటారు. పాన్ ఇండియా స్థాయిలో ఎంతోమందికి గుర్తింపు దక్కిందంటే కారణం ఆయనే. నిజంగా ఇది తెలుగు చిత్ర పరిశ్రమకు స్వర్ణయుగం. నా స్థాయిలో నేను సినిమాలు చేస్తుంటే, నువ్వు ఇంకా పైకి ఎదగాలి అంటూ ఈ అవకాశం ఇచ్చారు ప్రభాస్. ఆయన నటించి వెళ్లడం కాకుండా ఈ సినిమాకోసం జీవితాన్ని పెట్టారు. అన్ని భాషల్లోనూ ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఈ కథలో అంత శక్తి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ నటనను ఒక ప్రేక్షకుడిగా చూస్తూ నాకే కన్నీళ్లొచ్చాయి‘ అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రభాస్ వేదికనెక్కి ఓదార్చిన అనంతరం మళ్లీ మారుతి మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకుల్ని ఒక్క శాతం కూడా నిరుత్సాహపరచదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి జరీనా వహాబ్, టి.జి.విశ్వప్రసాద్, అనిల్ తడానీ, తమన్, నవీన్ ఎర్నేని, కృతిప్రసాద్, మహేశ్ ఆచంట తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకి ప్రధాన ఆకర్షణ ప్రభాస్ హెయిర్ స్టైలే. ఆయన పిలకతో ఈ వేడుకకు హాజరయ్యారు. ’స్పిరిట్’ కోసం ఆ గెటప్‌లో సిద్ధమయ్యారు. వేడుకలో అభిమానుల్ని ఉద్దేశించి ఉత్సాహంగా మాట్లాడారు. ఏదో ఒక రోజు అందరూ షాక్ అయ్యేలా వేదికపై వినోదం పంచుతానని ఆయన చెప్పడంతో అభిమానులంతా కేరింతలు కొట్టారు. వేడుకలో ప్రభాస్ పెళ్లి చేసుకునే అమ్మాయికి ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అంటూ ఓ అభిమాని ప్లకార్డు ప్రదర్శించారు. ‘అది తెలియకే ఇంకా పెళ్లిచేసుకోలేదు‘ అంటూ ఫన్నీగా సమాధానమిచ్చారు ప్రభాస్.

# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం




నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. ’బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది’ అని వాళ్లు అడగ్గా.. ’మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం’ అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇక అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం. శిరీష్-నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్- లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ‘మా పరిచయం ఎలా మొదలైందంటూ ఏదోఒక రోజు మా పిల్లలు అడిగితే ఇదే చెబుతా. నన్ను తమ సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ థాంక్స్‘ అని చెప్పారు.

# బడ్జెట్ పెరగడంతోనే టిక్కెట్ల రేట్లు పెరుగుదల
## నిర్మాత నాగవంశీ వెల్లడి



సినిమా బడ్జెట్ ఆధారంగానే టికెట్ ధరలు పెంచుతున్నామని ఎవరినీ దోచేయడానికి కాదని నిర్మాత నాగవంశీ చెప్పారు. తాము బతికేదే ఇండస్ట్రీ మీద అని అలాంటప్పుడు టికెట్ ధరలు పెంచి ప్రేక్షకులు థియేటర్‌లకు రాకుండా ఎందుకు చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన టికెట్ ధరల గురించి ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కొన్ని సినిమాలకు టికెట్ ధర రూ.99 నిర్ణయించారు. ఆ చిత్రాలు చిన్నవి కాబట్టి వాటికి ఆ ధర పెట్టినా కూడా బ్జడెట్‌కు సరిపడా ఓపెనింగ్స్ వచ్చేస్తాయి. అలాగే రూ.100కోట్లు, రూ.500కోట్లు ఖర్చుపెట్టి తీస్తున్నప్పుడు దాని ప్రకారం టికెట్ రేట్లు పెంచుతాం. అంత భారీ చిత్రాలకు కూడా రూ.99 ఉంటే సంవత్సరం ఆడితేగానీ రికవరీ అవ్వదు. ఇది సింపుల్ టాపిక్ దాన్ని చాలా పెద్దది చేసి మాట్లాడుతున్నారు. జనాలను దోచేయాలని నిర్మాతలెవరూ అనుకోరు. బ్జడెట్ ఎక్కువ ఉన్నవాటికి మాత్రమే ధరలు పెంచుతున్నామని అందరూ అర్థం చేసుకోవాలని అన్నారు. సినిమా ప్రచారాల గురించి నాగవంశీ మాట్లాడుతూ.. ‘సానుభూతి చూపిస్తే హిట్ అవుతుందనే అబద్ధం. అలాంటి జిమిక్కుల వల్ల ఒకటి, రెండు సినిమాలు హిట్ అవుతాయేమో కానీ ప్రతి దానికి అవి పనిచేయవు. ప్రచారంలో మాట్లాడిన మాటలు చూసి వచ్చేలా జనాలు లేరు. కథ బాగుంటే ప్రేక్షకులు ఎలాగైనా చూస్తారు. ’లిటిల్ హార్ట్స్’ చిన్న చిత్రమే అయినా పెద్ద విజయం సాధించింది కదా.. ఒక మూవీని తొక్కేస్తున్నారు అనేది కూడా వాస్తవం కాదు. హిట్ చేయాలా లేదా అనేది పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది‘ అని నాగవంశీ చెప్పారు.




# అప్పలసూరిగా.. జగపతి బాబు

రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన ‘రంగస్థలం’లో జగపతి బాబు విలనిజాన్ని ఏ స్థాయిలో ప్రదర్శించారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ‘పెద్ది’లోనూ ఈ కాంబినేషన్ అలరించనుంది. అప్పలసూరి పాత్రలో జగపతి బాబు నటిస్తున్నారని తెలియజేస్తూ చిత్ర బృందం తాజాగా పోస్టర్ విడుదల చేసింది. వయసు పైబడిన వ్యక్తిగా జగపతిబాబు లుక్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ‘ఇది అస్సలు ఊహించలేదు’, ‘మరో గుర్తుండిపోయే పాత్ర అవుతుంది’ అంటూ ఫ్యాన్స్ జగపతి బాబుకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ మూవీ ‘పెద్ది’. ఇటీవల దిల్లీలో ఓ షెడ్యూల్ షూటింగ్ ముగిసింది. 2026 మార్చి 27న సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, ‘మీర్జాపూర్’ సిరీస్‌తో క్రేజ్ సొంతం చేసుకున్న దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఛాంపియన్స్



తిరుమల శ్రీవారిని ’ఛాంపియన్’ చిత్ర బృందం దర్శించుకుంది. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినిమా హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్.. స్వామివారి సేవలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com